RNI APTEL/25/A0798

# టుడే విదుర

జాతీయ తెలుగు దిన పత్రిక

https://www.todayvidhura.com/

ప్రచురణ: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సంపుటి : 1 సంచిక:9 27-6-2025 శుక్రవారం ఎడిటర్ :మర్రి పవీణ్ పేజీలు : 8 వెల 4 /-

# సాగరమాల శుభారంభం



## దేశపు మొదటి మేరీ టైం నాన్-బ్యాంకింగ్ సంస్థ సాగర్ మాల ఫైనాన్స్

న్యూఢిల్లీ (టుడే విదుర, జూన్ 26): భారతదేశపు మొట్టమొదటి నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ సాగర్ మాల ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ ను కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్ శాఖా మంత్రి సర్బానంద సోనోవాల్ ఇవాళ ప్రారంభించారు. ఇది సముద్ర రంగంలో భారతదేశపు మొట్టమొదటి నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ. గతంలో సాగరమాల డెవలవ్‌మెంట్ కంపెనీ లిమిటెడ్‌గా ఉన్న ఈ సంస్థ ఇప్పుడు గా మారి అమృత్ కాల్ విజన్ 2047కి అనుగుణంగా ముందుకు సాగుతోంది. ఇది దేశ సముద్ర మౌలిక సదుపాయాల కల్పన, వాటి అభివృద్ధిలో కీలక భూమిక పోషిస్తోంది.మినీ రత్న కంపెనీ. కేటగిరీ-లో ఉన్న ఈ సెంట్రల్ పబ్లిక్ సెక్టార్ ఎంటర్‌ప్రైజ్‌ను జూన్ 19న రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారికంగా నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ గా గుర్తించింది. మన ఆర్థిక వ్యవస్థలో కీలకపాత్ర పోషిస్తోన్న సముద్ర రంగాన్ని బలోపేతం చేయడానికి ఈ సంస్థ ఎంతగానో దోహదపడుతుంది. ఈ సంస్థ మేరీ టైం రంగంలో ఆర్థిక సహకారాన్ని అందిస్తుంది. ఓడరేవులు, లు, స్టార్టప్‌లు, ఇతర సంస్థలను శక్తివంతం చేసేందుకు కూడా ఈ సంస్థ ఆర్థిక సహకారం అందిస్తుంది.సముద్ర రంగంలో ఆర్థిక ఇబ్బందుల్ని తొలగించడంతో పాటు, ఆర్థిక వృద్ధిని వేగవంతం చేయడానికి ఆర్థికంగా ఎంతో సపోర్ట్ ఇన్తుంది. ఈ కార్పొరేషన్ ద్వారా పోర్ట్ అథారిటీలు, షిప్పింగ్ కంపెనీలు, లు, స్టార్టప్‌లు, మేరీ టైం ఇన్సిట్యూషన్స్ వంటి విభిన్న శ్రేణి సంస్థలకు స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక నిధులు సమకూరుస్తుందీ సంస్థ.

# 'అఖండ గోదావరి' టూరిజం ప్రాజెక్ట్

# కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ తో కలిసి పవన్ శంకుస్థాపన



రాజమండ్రి:(టుడే విదుర, జూన్ 26): ఏపీ లోని రాజమహేంద్రవరంలో 'అఖండ గోదావరి' టూరిజం ప్రాజెక్ట్‌కు కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కలిసి నేడు శంకుస్థాపన చేశారు.పుష్కర ఘాట్ వద్ద రూ.94.44 కోట్ల వ్యయంతో అఖండ గోదావరి ప్రాజెక్ట్‌ను చేపట్టారు.

శంకుస్థాపన కార్యక్రమంలో ఏపీ మంత్రి కందుల దుర్గేశ్, బీజేపీ ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి పాల్గొన్నారు. అఖండ గోదావరి ప్రాజెక్ట్‌తో రాజమహేంద్రవరం ఇకపై పర్యాటక శోభను సంతరించుకోనుంది. సుమారు రూ.140 కోట్లతో మూడు కీలక అభివృద్ధి పనులకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ శ్రీకారం చుట్టారు. రాజమండ్రి వద్ద గోదావరిపై 127 సంవత్సరాల పాత రైల్వే వంతెనను టూరిజం స్పాట్‌గా ప్రభుత్వం అభివృద్ధి చేయనుంది.

ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ రాజమండ్రి అంటే గుర్తుకొచ్చేది గోదావరి తీరం డొక్కా సీతమ్మ అని, ఆదికవి నన్నయలకు జన్మనిచ్చిన నేల గోదావరి తీరమని పేర్కొన్నారు. రూ. 430 కోట్లతో ఏపీలో పర్యాటక ప్రాజెక్టులు చేపడుతున్నామన్నారు.

యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు.

.ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనతో పర్యాటక రంగంలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని, డబుల్ ఇంజన్ సర్కార్‌తో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేగంగా అభివృద్ధి చేస్తున్నాయని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా కేంద్ర మంత్రి షెకావత్ సహకారం అందించారన్నారు. అలాగే పోలవరం ప్రాజెక్ట కోసం షెకావత్ సహకారం అందించారని కొనియాడారు. ఏపీలో 974 కిలోమీటర్ల నదీ తీరం ఉందని, విదేశాల్లో నదీ తీరాలను పర్యాటక రంగంగా అభివృద్ధి చేసిన విధంగా అఖండ గోదావరి ప్రాజెక్టును పర్యాటకంగా తీర్చిదిద్దుతామన్నారు. 2035 నాటికి రాష్ట్ర వ్యాప్తంగా ఏపీలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తామని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. దేశ, విదేశీ పర్యాటకులను ఆకర్షించేలా రాజమండ్రి నగరం, చుట్టుపక్కల ప్రాంతాలను తీర్చిదిద్దేందుకు అఖండ గోదావరి ప్రాజెక్టుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో ప్రభుత్వం ఈ ప్రాజెక్ట్‌కు ప్రారంభించింది. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పర్యటన నేపధ్యంలో రాజమండ్రి పుష్కర ఘాట్ వద్ద పోలీసులు ప్రటిష్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. శంకుస్థాపన కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా ఇంచార్జ్ మంత్రి నిమ్మల రామానాయుడు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, బత్తుల బలరామకృష్ణ సహా కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ఏపీలో హార్బర్లు, పోర్టుల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి



విజయవాడ:(టుడే విదుర, జూన్ 26): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో హార్బర్లు, పోర్ట్‌ల నిర్మాణంపై తమ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఏడాది కాలంలో వీటిని పూర్తి చేసి ప్రారంభించే విధంగా పనులు చేపడుతున్నామని తెలిపారు. ఫేజ్ టూ కింద మరో నాలుగు ఫిషింగ్ హార్బర్లలో కూడా నిర్మాణ పనులు చేపడతామని వివరించారు. 950 కిలోమీటర్ల తీర ప్రాంతంలో.. ప్రతి 50 కిలోమీటర్లకు షిప్పింగ్ బోట్లు ఏర్పాటు చేశామని వెల్లడించారు.(గురువారం) ఏపీ ఇన్ ల్యాండ్ వాటర్ అథారిటీ ఆధ్వర్యంలో స్టేక్ హెూల్డర్స్ కన్సల్టేషన్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, ఏపీ ఇన్‌ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ చైర్మన్ జెడ్. శివప్రసాద్, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ కార్యదర్శి యువరాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు.

## శిబు సోరెన్‌ను పరామర్శించిన రాష్ట్రపతి ముర్ము



ఢిల్లీ (టుడే విదుర, జూన్ 26): ఢిల్లీలోని సర్ గంగారామ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జార?ండ్ మాజీ సీఎం శిబు సోరెన్ ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పరామర్శించారు. ఇవాళ ఆసుపత్రికి వెళ్లిన రాష్ట్రపతి.. అక్కడ శిబు సోరెన్ కుమారుడు, జార?ండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను కలిశారు. ఈ సందర్భంగా శిబు సోరెన్ ఆరోగ్య పరిస్థితి గురించి హేమంత్ సోరెన్‌ను అడిగి తెలుసుకున్నారు.81 ఏళ్ల శిబు సోరెన్ తీవ్ర అస్వస్థతతో రెండు రోజుల క్రితం ఆసుపత్రిలో చేరిన విషయం తెలిసిందే. ఢిల్లీలోని సర్ గంగారామ్ ఆసుపత్రి లో శిబు సోరెన్‌కు చికిత్స కొనసాగుతోంది. అయితే, రాష్ట్రపతి ముర్ము 2015 మే నుంచి 2021 జులై వరకూ జార?ండ్ గవర్నర్‌గా పని చేసిన విషయం తెలిసిందే. ఆ సమయంలో శిబు సోరెన్‌తో ఆమెకు పరిచయం ఉంది. ఈ పరిచయంతోనే మాజీ సీఎంను రాష్ట్రపతి పరామర్శించారు.

## గోల్కొండలో ప్రారంభమైన బోనాల సందడి – తొలి రోజు బోనమెత్తిన పలువురు ప్రముఖులు



హైదరాబాద్, (టుడే విదుర, జూన్ 26): హైదరాబాద్‌లో ఆషాఢ మాస బోనాల ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అమ్మా.. సల్లంగ చూడు అని వేడుకుంటూ బోనాల సంబురానికి ఆడపడుచులు గురువారం శ్రీకారం చుట్టారు. ఆషాఢ మాసంలో తొలి గురువారం గానీ, ఆదివారం గానీ బోనాల సందడి ప్రారంభమవుతుంది. ఈ ఏడాది ఆషాఢం మాసం గురువారం రావడంతో బోనాల పండగ ప్రారంభించారు. ఆనవాయితీ ప్రకారం గోల్కొండ జగదాంబిక ఆలయం నుంచి బోనాల సంబురాలకు భక్తులు శ్రీకారం చుట్టారు. దీంతో గొల్కొండ ప్రాంతం భక్తులతో కిటకిటలాడుతోంది.

పట్టువస్త్రాలు సమర్పించి తొలిబోనాలు ఎత్తిన స్పీకర్, మంత్రులు

ఆషాఢమాస బోనాల సంబురం సందర్భంగా లంగర్ హౌజ్ చౌరస్తాలో గోల్కొండ జగదాంబ మహంకాళి అమ్మవారికి ప్రభుత్వం తరుపున స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, దేవదాయశాఖ మంత్రి కొండా సురేఖ, హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ పట్టువస్త్రాలు, తొలి బోనం సమర్పించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

ఈ సందర్భంగా భక్తులతోపాటు నృత్యం చేస్తూ వారిని పొన్నం ప్రభాకర్ ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ ఎంసీ మేయర్ గద్వాల విజయ లక్ష్మీ, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, హైదరాబాద్ కలెక్టర్ దాసరి హరిచందన , సీపీ సీవీ ఆనంద్ ,కాంగ్రెస్ సీనియర్ నేత విహెచ్, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ కూడా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు..

# ఎంపీడీవో ఖాళీలను భర్తీ చేయండి

## పంచాయతీరాజ్ అధికారుల సంక్షేమ సంఘం విజ్ఞప్తి

అమరావతి, (టుడే విదుర, జూన్ 26): రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఎంపీడీవో పోస్టులను భర్తీ చేయాలని ఏపీ పంచాయతీరాజ్ అధికారుల సంక్షేమ సంఘం ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు విజ్ఞప్తి చేసింది. పలు మండలాల్లో పోస్టులు ఖాళీగా ఉండటం వల్ల ఇన్‌చార్జులతో ఇబ్బందులు పడుతున్నట్టు తెలిపింది. 2015 నుంచి ఎంపీడీవో పదోన్నతులు అడహాక్ విధానంలో ఇవ్వడం వల్ల రిటైర్ అవుతున్న ఎంపీడీవోలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆ పోస్టులను రెగ్యులర్ చేయడం ద్వారా పే ఫిక్సేషన్‌కు అవకాశం కల్పించాలని కోరారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న జడ్పీ సీఈవో పోస్టులను కూడా భర్తీ చేయాలని కోరారు. సంఘం నేత కేవీవీ ప్రసాద్ వినతి పత్రాన్ని పవన్‌కల్యాణ్ ఓఎస్డీ వెంకటకృష్ణకు అందించారు.

# గోదావరి పుష్కరాలకు మంత్రుల కమిటీ

## కమిటీలో ఆర్థిక సహా 12 శాఖల మంత్రులు



అమరావతి, (టుడే విదుర, జూన్ 26): గోదావరి పుష్కరాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం మంత్రుల కమిటీని నియమించింది. 12 మంది మంత్రులను కమిటీలో నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు. దేవదాయ, జలవనరుల, హోం, మున్సిపల్, రెవెన్యూ, పర్యాటక, కార్మిక, రవాణా, ఆరోగ్య, ఆర్ అండ్ బీ, విద్యుత్, ఆర్థిక శాఖల మంత్రులను కమిటీలో సభ్యులుగా నియమించారు. దేవదాయ శాఖ కార్యదర్శి కమిటీ మెంబర్ కన్వీనర్‌గా ఉంటారు. మంత్రుల కమిటీ సభ్యులు గోదావరి పుష్కరాలు సజావుగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు విధానాలు రూపొందించడంతో పాటు సలహాలు, సూచనలు ఇవ్వాలి. దేవదాయ శాఖ కార్యదర్శి మంత్రుల కమిటీతో సమన్వయం చేసుకోవాల్సి ఉంటుంది. ఆయా శాఖల కార్యదర్శులు కూడా మంత్రులకు సపోర్టుగా ఉండాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# అగ్నిమాపక కేంద్రాల్లో ఆధునిక పరికరాలు

## డీఎఫవోతో మాట్లాడుతున్న ఆర్ఎఫవో భూపాల్ రెడ్డి ఆర్ఎఫవో భూపాల్ రెడ్డి



చిత్తూరు (టుడే విదుర, జూన్ 26): అగ్నిమాపక కేంద్రాలకు ఆధునిక పరికరాలు రానున్నాయని రీజనల్ ఫైర్ ఆఫీసర్ (ఆర్ఎఫవో) భూపాల్ రెడ్డి చెప్పారు. జిల్లాలోని అగ్నిమాపక కేంద్రాల తనిఖీల్లో భాగంగా ఆయన జిల్లాకొచ్చారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ములకలచెరువు, పాకాలలో నూతన అగ్నిమాపక కేంద్రాల నిర్మాణానికి ఒక్కో భవనానికి రూ.2.25 కోట్లు మంజూరయ్యాయని చెప్పారు. వాయల్పాడులో అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణాన్ని పూర్తి చేయడానికి రూ.15లక్షలు మంజూరైనట్లు తెలిపారు. వెదురుకుప్పం, సదుంలో నూతన అగ్నిమాపక కేంద్రాల ఏర్పాటుకు గతంలో ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని అన్నారు. అగ్నిమాపక కేంద్రాల్లో సిబ్బంది కొరత ఉందని.. ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లామని తెలియజేశారు. డీఎఫవో పెద్దిరెడ్డి, ఏడీఎఫవో కరుణాకర్ పాల్గొన్నారు.

# పీజీ సెట్ ఫలితాల్లో ఎస్వీయూ పరిధిలో 87 శాతం ఉత్తీర్ణత

## ఫలితాలు విడుదల చేస్తున్న ఎస్వీయూ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, పీజీసెట్ కన్వీనర్ వెంకటేశ్వర్లు తదితరులు



తిరుపతి (టుడే విదుర, జూన్ 26): రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో ప్రవేశానికి నిర్వహించిన ఏపీ పీజీసెట్ ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. ఈ ఏడాది ఎస్వీ యూనివర్సిటీ ఈ పరీక్ష నిర్వహించింది. ఈ ఫలితాల వివరాలను ఎస్వీయూ వీసీ అప్పారావు, రిజిస్ట్రారు మాదాల భూపతి నాయుడు పీజీ సెట్ కన్వీనరు, ఓఆర్ఐ ప్రొఫెసర్ పీసీ వెంటేశ్వర్లు వెల్లడించారు. ఎస్వీయూ రీజియన్‌లో పీజీసెట్‌కు 6800 మంది దరఖాస్తు చేసుకోగా, 5764 మంది పరీక్ష రాశారు. వీరిలో 5019 మంది ఉత్తీర్ణులయ్యారు. రాష్ట్రంలోని 17 యూనివర్సిటీల్లోని 143 సబ్జెక్టులలో పీజీ ప్రవేశానికిగాను 31 సబ్జెక్టులకు పరీక్ష నిర్వహించారు. చిత్తూరు జిల్లాకు చెందిన ప్రేమ్‌కుమార్ జనరల్.. దివ్యేషరెడ్డి జాగ్రఫీలో ప్రథమ ర్యాంకు సాధించారు. పీజీసెట్ దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన, పరీక్షల నిర్వహణ, ఫలితాల వెల్లడిలో వేగం, పారదర్శకత పాటించినట్టు అధికారులు చెప్పారు. ఈ కార్యక్రమంలో సీడీసీ డీన్ చెంద్రాయుడు, రీసెర్చ్ డీన్ నరసింహ, కల్చరల్ కో–ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ చౌదరి, ప్రిన్సిపాళ్ళు నరసయ్య, శ్రీనివాసులు, పద్మావతి, సుధారాణి, డెవలప్‌మెంట్ డీన్ బాలాజీ, పీజీసెట్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# గుండెపోటుతో రైతు మృతి

## కుమార్తె వీడియోలతో చర్చనీయాంశంగా మారిన వైనం

రామకుప్పం, (టుడే విదుర, జూన్ 26): రామకుప్పం మండలం కిలాకిపోడు గ్రామంలో ఓ రైతు మృతి చెందడం కుప్పం నియోజకవర్గవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఇటీవల ఎయిర్‌పోర్టు కోసం భూసేకరణ జరుగుతున్న గ్రామాల్లో ఎవరు చనిపోయినా రకరకాలప్రచారాలు జరిగి చర్చనీయాంశమవుతున్నాయి.ఎయిర్‌పోర్టుకు భూములు తీసుకుంటున్నారన్న మనస్తాపంతోనే వారు మృతి చెందుతున్నారంటూ కొందరు పనిగట్టుకుని ప్రచారంచేస్తూ సాధారణ మరణాలను కూడా వివాదాస్పదంగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారు. మూడు నెలల క్రితం మణీంద్రం గ్రామంలో ఓ యువకుడు వ్యక్తిగత సమస్యలతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అప్పట్లో స్థానికంగా పలుకుబడి కలిగిన వ్యక్తులు అతని భూములు ఎయిర్‌పోర్టుకు తీసుకుంటున్నారన్న మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడని పుకార్లు పుట్టించారు. కుటుంబసభ్యులు ఆ పుకార్లలో నిజం లేదని వెల్లడించడంతో వారి నోళ్ళు మూతపడ్డాయి. ఈ నేపథ్యంలో గుండెకు సంబంధించిన వ్యాధితో బాధపడుతూ, కొన్ని నెలల క్రితం ఆపరేషన్ చేసుకున్న కిలాకిపోడుకు చెందిన రైతు శ్రీనివాసులు ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. ఎవరు ప్రభావితం చేశారో కానీ తన తండ్రి ఎయిర్‌పోర్ట్ కోసం భూసర్వే ప్రారంభమైనప్పటి నుంచి సక్రమంగా తిండి తినలేదని, అందుకే మృతి చెందాడని శ్రీనివాసులు కుమార్తె మాట్లాడుతున్న విడియో ఒకటి బయటకు వచ్చింది.దీనిపై చర్చ సాగుతుండగానే మధ్యాహ్నం ఆమె మాట్లాడుతున్న మరో విడియో సోషల్ మీడియాలో వైరలైంది. తన తండ్రి అనారోగ్యంతోనే మృతి చెందాడని, ఉదయం పొరబాటున వేరే విధంగా చెప్పానని ఆమె ఆ విడియోలో తెలిపింది. తన తండ్రికి ముగ్గురు అమ్మాయిలు, ఒక అబ్బాయి ఉన్నారని, ఇద్దరు అమ్మాయిలకు పెళ్ళిళ్ళు జరిగాయని ఆమె ఆ విడియోలో చెప్పుకొచ్చింది. పేదరికం కారణంగా మిగిలిన ఇద్దరి పోషణ, వారికి విద్యనందించడం ఇబ్బందికరంగా మారిందని, తమ కుటుంబాన్ని సీఎం చంద్రబాబు ఆదుకోవాలని ఆమె కోరింది.

# దిక్కు తోచక.. నష్టాలు భరించలేక!

## మామిడి చెట్లను నరికేస్తున్న కూలీలు వంద ఎకరాల్లో మామిడి చెట్లు నరికేసిన రైతులు



(టుడే విదుర, జూన్ 26): సంప్రదాయ పంటలైన వరి, వేరుశనగ, చెరకు, చిరుధాన్యాల ఖర్చులు పెరిగిన నేపథ్యంలో గిట్టుబాటు లేకపోవడంతో సాగు తగ్గించేశారు. క్రమేణా మామిడి తోటల పెంపకంపై రైతులు దృష్టి సారించారు. రామచంద్రాపురం మండలంలో 30 ఏళ్ల క్రితం వరకు వెయ్యి ఎకరాల్లో మామిడితోటలు ఉండేవి. ఉపాధి హామీ పథకంలో వంద శాతం సబ్సిడీ ఇవ్వడంతో ప్రస్తుతం 4,500 ఎకరాల్లో సాగయ్యాయి. గత ఐదేళ్లుగా మామిడి తోటలకు మూడు నుంచి నాలుగు దఫాలుగా మందులు పిచికారీ చేస్తే తప్ప పూత నిలవని పరిస్థితి. దీంతో పాటు ధరలు పడిపోయి తోటల్లో కాపు వదిలేయాల్సిన పరిస్థితి ఎదురైంది. నాణ్యమైన మందులు లేకపోవడంతో కాపు కాయలేదని రైతులు అంటున్నారు. ఒకవేళ కాపు వచ్చినా కాయ పక్వానికి వచ్చిన దశలో పురుగులు పడి చెడిపోతున్నాయంటున్నారు. 200 ఏళ్ల నాటి చెట్లు బాగున్నా.. గత 25ఏళ్లలో నాటినవి కాపు కాయక కొమ్మలు ఎండిపోతున్నాయి. ఇలా రైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్న మామిడి.. పెట్టుబడి కూడా రాకపోవడంతో చెట్లు తొలగించడమే మార్గంగా భావిస్తున్నారు. ఈ ఏడాది గంగిరెడ్డిపల్లి, కమ్మకండ్రిగలో పలువురు రైతులు దాదాపు వంద ఎకరాల్లో మామిడి చెట్లను నరికేశారు. ఒక్కో చెట్టును సైజును బట్టి రూ.500 నుంచి రూ.1,300లోపు వ్యాపారులకు అమ్మేశారు. ఇలా మండలంలోని పలు గ్రామాల రైతులు చెట్లు తొలగించడానికే సిద్ధమైనట్లు తెలుస్తోంది.25 ఏళ్ల కిందట 5 ఎకరాల్లో మామిడిచెట్లను నాటాను. పదేళ్ల పాటు కాపు బాగానే వచ్చింది. ఎరువులు, దున్నకం, మందులు, సాగు ఖర్చు కూడా ఎకరాకు రూ.25 వేలనుంచి రూ.30వేలు అవుతోంది.

# హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలి



బొబ్బిలి, (టుడే విదుర, జూన్ 26): హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలని, ఏపీసీఓఎస్‌ను రద్దు చేస్తే కార్మికులను పర్మినెంట్ చేయాలని, పదవీ విరమణ వయస్సును 62 సంవత్సరాలకు పెంచాలని మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికులు కోరారు. బొబ్బిలి మునిసిపల్ కార్యాలయం ఎదుట ఇంజనీరిగ్ కార్మికుల ధర్నా మూడోరోజు కొనసాగింది. సందర్భంగా వారు మాట్లాడుతూ నీటి సరఫరా, వీధిదీపాల కార్మికుల కనీస వేతనం టెక్నికల్‌కు రూ.29,200, నాన్ టెక్నికల్‌కు రూ.24,600చొప్పున చెల్లించాలని, 15 సంవత్సరాల సీనియారిటీ ఉన్న వారిని రెగ్యులర్ చేయాలని, విధినిర్వహణలో చనిపోయినవారికి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియోతో పాటుకుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని, సీనియారిటీ ప్రకారం జీతాలు చెల్లించాలని కోరారు. పదవీవిరమణ తరువాత గ్రాట్యూటీ, రూ. 10 వేలు పెన్షన్ చెల్లించాలని, 69 రోజులు సెలవు ప్రకటించాలని డిమాండ్‌చేశారు.

# కలెక్టర్ కారు, కుర్చీ, కంప్యూటర్ అటాచ్

## ఏడో అదనపు జిల్లా కోర్టు న్యాయాధికారి తీర్పు

## ప్రభుత్వ మాజీ న్యాయవాదికి గౌరవ వేతనం ఇవ్వనందుకు చర్యలు



(విశాఖపట్నం),(టుడే విదుర, జూన్ 26): ప్రభుత్వ న్యాయవాది గా పనిచేసిన వ్యక్తికి గౌరవ వేతనంతో పాటు ఖర్చులు చెల్లించనందుకు గాను కలెక్టర్ కారు, కుర్చీ, కంప్యూటర్‌తో పాటు మరిన్ని వస్తువులను అటాచ్ చేస్తూ నగరంలోని ఏడో అదనపు జిల్లా కోర్టు న్యాయాధికారి తీర్పునిచ్చారు. నగరానికి చెందిన సీనియర్ న్యాయవాది తాళ్లూరు రవికుమార్ గతంలో జిల్లా కోర్టులో ప్ర భుత్వ న్యాయవాదిగా పనిచేశారు. ఆ సమయంలో ఆయనకు చెల్లించాల్సిన నెలవారీ వేతనంతోపాటు కేసుల్లో ఖర్చుచేసిన బిల్లు మొత్తాన్ని ప్రభుత్వం చెల్లించలే దు. దీంతో రవికుమార్ జిల్లా కోర్టులో కేసు వేశారు. ఈ కేసును ఏడో అదనపు జిల్లా న్యాయాధికారి విచారించారు. న్యాయవాదికి చెల్లించాల్సిన రూ.50 లక్షల గౌరవ వేతనంతో పాటు ఆయన ఖర్చుచేసిన రూ.25 లక్షలు కూడా చెల్లించాలని గత జనవరిలో తీర్పునిచ్చారు. అది అమలు కాకపోవడంతో తీర్పును అమలుచేయాలని కోరుతూ న్యాయవాది పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై రాష్ట్రప్రభుత్వం హైకోర్టును ఆశ్రయించినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. న్యాయవాది పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయాధికారి.. రూ.75 లక్షలకు కలెక్టర్ కారు, కుర్చీ, కంప్యూటర్, కార్యాలయంలోని మరిన్ని కంప్యూటర్లు, కలెక్టర్ చాంబర్‌లో 25 కుర్చీలు, ఇతర సామగ్రిని అటాచ్ చేయాలంటూ తీర్పునిచ్చారు.

# సమస్యలు పరిష్కరించాలి

## రిలే నిరాహార దీక్ష చేస్తున్న మున్సిపల్ కార్మికులు



నంద్యాల (టుడే విదుర, జూన్ 26): : మున్సిపాలిటీల్లో పని చేసే కార్మికులకు రూ.26వేలు జీతం ఇవ్వాలని, అలాగే వివిధ సమస్య లను పరిష్కరించాలని ఏపీ మున్సిపాలిటీ ఇంజనీర్ వర్కర్స్ యూని యన్ సభ్యులు రామాంజినేయులు, దుర్గన్న కోరారు. పట్టణంలోని మున్సి పాలిటీ కార్యాలయం ఎదుట యూనియన్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. వారు మాట్లాడుతూ కార్మికులు ఎవరైనా చనిపోతే వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగ అవకాశం కల్పించాలన్నారు. ఉద్యోగ విర మణ సమయంలో బెనిఫిట్స్ ఇవ్వాలని, గ్రాడ్యువిటీ రూ.7 లక్షలు ఇవ్వా లని కోరారు. ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. అలాగే తల్లికి వందనం వంటి సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. గౌస్, భాస్కరాచారి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

## అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్‌వో వెంకటరమణ



వెలుగోడు, (టుడే విదుర, జూన్ 26): గిరిజన గూడేల్లోని గిరిజనులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్‌వో వెంకటరమణ సూచించారు. పట్టణంలోని విజయదుర్గ, జగనన్న కాలనీ వద్ద ఉన్న చెంచు కాలనీలను ఆయన సందర్శించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ గిరిజనతండాల్లో గిరిజనులకు రక్తహీనత రాకుండా వైద్యులు సేవలు అందించాలన్నారు. గిరిజన ప్రభావిత ప్రాంతాలలో సికెల్ సెల్ ఎనీమియా వ్యాధి సోకకుండా అవగాహన కల్పించాలన్నారు. వైద్యాధికారులు ప్రసన్నలక్ష్మి, సుధా ప్రణిత, సీహచ్‌వో నాగేశ్వరరావు, సిబ్బంది మధుసూదన్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

# సస్యరక్షణ చర్యలు పాటించాలి



నందికొట్కూరు (టుడే విదుర, జూన్ 26): : మొక్కజొన్న పంటలో కాండం తొలిచే పురుగు చాలా ఉధృతంగా ఉందని, రైతులు ఎప్పటికప్పుడు నూతన సస్యరక్షణ చర్యలు పాటించాలని నందికొట్కూరు ఏవో షేక్షావలి రైతులకు సూచించారు. నందికొట్కూరు అలాగే బిజినవేముల గ్రామంలో పంట పొలాలలో రైతులు సాగు చేసిన మొక్క జొన్నపంటలను ఏవో, వ్యవసాయ అనుబంధ శాఖ అధికారులు, న్యాచురల్ ఫామింగ్ అధికారులు రైతులతో కలిసి పరిశీలించారు. అలాగే పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్క జొన్న పైరులో కాండం తొలుచు పురుగును గుర్తించి నివారణ చర్యల గురించి వివరించారు. వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నియంత్రణకు పకడ్బందీ చర్యలు



కర్నూలు(టుడే విదుర, జూన్ 26): ట్రాఫిక్ నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపట్టినట్లు ఎస్పీ విక్రాంత పాటిల్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ట్రాఫిక్ నియంత్రణ కోసం అత్యాధునిక టెక్నాలజీతో రూపొందించిన 2 బుల్లెట్ వాహనాలు, 20 అపాచి వాహనాలను ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందరర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర డీజీపీ మంగళగిరి నుంచి వచ్చిన ఈ వాహనాలను సైరన, బ్లింకర్స్, పబ్లిక్ అడ్రెసింగ్ సిస్టం, క్రౌడ్ కంట్రోల్ చేయడానికి అత్యాధునిక టెక్నాలజీతో రూపొందించారన్నారు. జిల్లాలోని కర్నూలు, ఎమ్మిగనూరు, ఆదోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లకు ఈ వాహనాలు కేటాయిస్తామన్నారు. ట్రాఫిక్ అంతరాయం ఏర్పడినప్పుడు ఈ వాహనాలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. ఎక్కడైనా ఓవర్ లోడింగ్, రాంగ్‌రూట్, వంటి ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడితే వారి ఫొటోలను తీసి వాట్సాప్‌కు పంపిస్తే అటువంటి వారిని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లకు తీసుకువచ్చి కౌన్సెలింగ్ ఇవ్వడం, జరిమానా విధిస్తామ న్నారు. అనంతరం డీవీఆర్ గ్రూప్స్ అధినేత డి.వెంకటేశ్వరరెడ్డి జిల్లా పోలీసు శాఖకు డీజె డ్రోన కెమెరాను అందజేశారు. కార్యక్రమంలో సదరన రీజియన హెూంగార్డు కమాండెంట్ మహేష్ కుమార్, ఏఆర్ అడిషినల్ ఎస్పీ కృష్ణమోహన, డీఎస్పీలు బాబు ప్రసాద్, బాస్కర్‌రావు, ప్రసాద్, సీఐలు తేజమూర్తి, మన్సూరుద్దీన, అబ్దుల్‌గౌస్, నాగరాజరావు, రామానాయుడు, ఆర్‌ఐలు నారాయణ, జావేద్, సోమశేఖర్ నాయక్, ట్రాఫిక్ ఆర్‌ఎస్‌ఐ హుశేన, కర్నూలు, ఎమ్మిగనూరు, ఆదోని ట్రాఫిక్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# కస్తూర్బా పాఠశాలలో షార్ట్ సర్క్యూట్

- షార్ట్‌సర్క్యూట్ జరిగిన గదిలో నుంచి వస్తున్న మంటలు
- %కస్తూర్బా పాఠశాలలో షార్ట్ సర్క్యూట్
- 280 పరుపులు దగ్ధం
- రూ.12 లక్షల వరకు ఆస్తి నష్టం



కొత్తవలస, (టుడే విదుర, జూన్ 26): తుమ్మికాపల్లి పంచాయతీ పరిధిలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో తెల్లవారుజామున భారీ అగ్ని ప్రమాదం జరిగింది. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగి ఉండొచ్చునని భావిస్తున్నారు. రూ.12 లక్షల వరకు ఆస్తినష్టం ఉంటుందని అగ్నిమాపక అధికారులు అంచనా వేశారు. పాఠశాల మొదటి అంతస్తులో ఇంటర్ విద్యార్థులకు సంబంధించిన స్టోర్ రూంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. పాఠశాల విద్యార్థినుల కోసం ఒక స్వచ్ఛంద సంస్థ మంగళవారం సాయంత్రం విరాళంగా ఇచ్చిన 280 పరుపులు పూర్తిగా కాలిపోయాయి. విద్యార్థులు తమ సామగ్రిని భద్రపర్చుకునే ఐరన్ బాక్సులు, వాటిలో ఉంచుకున్న పుస్తకాలు, దుస్తులు కూడా కాలిపోయాయి. వీటి విలువ సుమారు రూ.12 లక్షల ఉండొచ్చునని భావిస్తున్నారు. తెల్లవారుజాము 3 గంటల సమయంలో స్టోర్ రూం నుంచి పొగలు రావడంతో కొంత మంది విద్యార్థులు చూసి ప్రిన్సిపాల్ విజయకుమారికి చెప్పారు. ఆమె వెంటనే స్థానిక అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. వారొచ్చి మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. ఎస్‌ఐ అశోక్ కుమార్ శృంగవరపుకోట అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో మరో ఫైరింజన్ వచ్చింది. తెల్లవారుజాము నుంచి ఉదయం 8 గంటల వరకు రెండు ఫైరింజన్‌ల సాయంతో మంటలను అదుపు చేశారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగి ఉంటుందని అగ్నిమాపకాధికారి అశోక్‌కుమార్ తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో విద్యార్థులందరూ గ్రౌండ్‌ఫ్లోరులో ఉన్నారని ప్రిన్సిపాల్ విజయకుమారి తెలిపారు. అగ్నికీలలు మిగిలిన గదులకు విస్తరించలేదు.స్పందించిన విద్యాశాఖ మంత్రి లోకేశ్ అగ్నిప్రమాదం జరిగిన విషయాన్ని తెలుసుకున్న విద్యాశాఖ మంత్రి నారాలోకేశ్ ప్రమాదంలో కోల్పోయిన సామగ్రి, పుస్తకాలు, దుస్తులు వెంటనే సమకూర్చే ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

# పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నం

## ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన బసవరాజు

## రుణం ఇప్పిస్తానని డబ్బులు తీసుకొని వేధించడంతో..

## మంత్రాలయం వెలుగు కార్యాలయం ముందు ఘటన



మంత్రాలయం, (టుడే విదుర, జూన్ 26): రుణం ఇప్పిస్తానని డబ్బులు తీసుకొని ఉద్యోగి సతాయించడంతో విసిగి వేసారిన పురుగుమందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటనంలో మంత్రాలయంలోని ఐకేపీ కార్యాల యం ముందు చోటుచేసుకుంది. బాధితుడి బంధువులు తెలిపిన వివరాలు.. కోసిగి మండలం వందగల్లు గ్రామానికి చెందిన బసవరాజు నుంచి కౌతాళం మండలం కరిణి గ్రామానికి చెందిన వీబీకే శ్రీరాములు ఆదోని హెచ్‌డీఎస్‌పీ బ్యాంకులో ఇంటిపై రుణం ఇప్పిస్తామని రూ.18,500 తీసుకున్నాడు. అంత టితో ఆగకుండా మరో రూ.50వేలు డిపాజిట్ కోసం తీసుకుని రెండు నెలలుగా రుణం ఇప్పించలేదు. తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వకుండా సతాయిస్తున్నాడు. కౌతాళం మండలంలో వెలుగు ఏపీఎంగా అప్పట్లో పని చేసిన రాజశేఖర్, కరణి వీబీకే శ్రీరాము లుకు అత్యంత సన్నిహితంగా ఉన్నారు. ఏడు నెలల క్రితం కౌతాళం ఏపీఎం నుంచి మంత్రాలయానికి బదిలీపై వచ్చి విధులు నిర్వహిస్తున్నారు. గృహ నిర్మాణానికి శ్రీనివాసులు, అప్పట్లో కౌతాళంలో పని చేస్తున్న వెలుగు కార్యాలయంలో పని చేస్తున్న ఏపీఎం రాజశేఖర్‌కు సంబంధం ఉందని, మంత్రాలయం వెలుగు కార్యాలయానికి బాధితుడు బసవరాజు, పిన్ని లక్ష్మీదేవితో కలిసి వచ్చాడు. రాజశేఖర్‌ను డబ్బులు ఇప్పిం చాలని అడిగాడు. శ్రీరాములుతో మాట్లాడుతానని చెప్పారు. అంతలోనే ఆఫీసు ముందు తనవెంట తెచ్చుకున్న పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి స్పృహ తప్పిపడిపోయాడు. గమనించిన ఆఫీసులోని అధికారులు, లక్ష్మీదేవి రక్షించే ప్రయత్నం చేశారు. స్పృహ కోల్పోవడంతో 108అంబులెన్సు ద్వారా ఎమ్మిగ నూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మంత్రాలయం వెలుగు కార్యాలయంలో పురుగు మందు తాగి ఆత్యహత్యకు పాల్పడ్డాన్న విషయంతో చర్చనీయాంశంగా మారింది.

# గంజాయితో దొరికారు



- గంజాయి ప్యాకెట్లను చూపిస్తున్న సీపీ
- నగరంలో తమిళనాడుకు చెందిన బ్యాచ్ అరెస్టు
- ప్రత్యేక వాహనం.. అందులో పెద్దపెద్ద బాక్సులు
- వాటిలో గంజాయి.. కనిపించకుండా థర్మాకోల్ బాక్సులు
- తెలివిగా రవాణా చేస్తున్న ఇద్దరిని పట్టుకున్న ఖాకీలు
- రెండు వ్యానుల్లో 200 కిలోల గంజాయి స్వాధీనం

(టుడే విదుర, జూన్ 26): : అండి నాగరాజు.. విశాఖపట్నం జిల్లా తగరపువలస ప్రాంతానికి చెందినవాడు. పుట్టి పెరిగిందంతా కోయంబత్తూరు. తర్వాత తగరపువలస వచ్చి తినుబండారాల వ్యాపారం చేసుకుంటూ జీవిస్తున్నాడు. అనబలగన్ సిన్రసు.. తమిళనాడులోని కక్కి సింగయన్ పట్టి గ్రామం. వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఏవోబీ సరిహద్దుల నుంచి తీసుకెళ్లిన గంజాయికి కోయంబత్తూరు చుట్టుపక్కల మంచి డిమాండ్ ఉందని వీరు గుర్తించారు. సిన్రసు ఏదైనా సరుకును ఉత్తరాంధ్రకు తీసుకొచ్చినప్పుడు నాగరాజును కలుస్తుండేవాడు. తమిళనాడులో గంజాయికి ఉన్న డిమాండ్ గురించి తెలుసుకున్నాడు. దీంతో ఉత్తరాంధ్ర చుట్టుపక్కల ఎక్కడెక్కడ గంజాయి సాగవుతుందో తెలుసుకుని, విక్రయించే ముఠాలతో పరిచయాలు పెంచుకున్నారు. ఏవోబీ సరిహద్దుల నుంచి గంజాయిని కొని తమిళనాడుకు తరలించాలని నిర్ణయించుకున్నారు. తద్వారా భారీగా ఆదాయాన్ని ఆర్జించవచ్చని భావించారు.నాగరాజు, సిన్రసు కొన్నాళ్లుగా ఏవోబీ సరిహద్దుల నుంచి గంజాయిని ప్రత్యేక వాహనాల్లో తరలిస్తున్నారు. తర్వాత గంజాయి కోసం ప్రత్యేకంగా ఒక గూడ్స్ వ్యాన్‌కు మార్పులు చేర్పులు చేయించారు. ట్రక్ అడుగు భాగాన్ని చిన్నచిన్న గదులుగా, గంజాయి ప్యాకెట్లను పెట్టే అరలుగా చేయించారు. గంజాయిని రెండు కిలోల చొప్పున ప్యాకెట్లుగా తయారు చేశారు. వాటిని ఈ అరల్లో అమర్చారు. జాతీయ రహదారిపై కానీ, అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద కానీ పోలీసులు ఆపి తనిఖీ చేసినప్పుడు అనుమానం రాకుండా ఆ అరలపై థర్మాకోల్ ఐస్‌బాక్సులను ఏర్పాటు చేశారు. వాటిలో మత్స్యసంపద ఉన్నట్టుగా చూపించేవారు. ఈవిధంగా కొన్నాళ్ల నుంచి గంజాయిని తరలిస్తున్నారు. వీరిద్దరూ లోగడ పోలీసులకు చిక్కిన సందర్భాలు ఉన్నాయి. ఇద్దరి పైనా పాత కేసులు ఉన్నాయని పోలీసులు తెలిపారు. సిన్రసుపై మంగళగిరి పీఎస్‌లో, నాగరాజుపై ఉత్తరాంధ్ర జిల్లాల్లో కేసులు నమోదైనట్టు చెబుతున్నారు. నాగరాజు, సిన్రసు రెండు వేర్వేరు వాహనాల్లో గంజాయిని తరలిస్తూ ఈగల్ బృందాలకు విజయవాడలో పట్టుబడ్డారు. సిన్రసు నడుపుతున్న వ్యాన్‌లో 100 కిలోలు, నాగరాజు నడుపుతున్న కారులో మరో 100 కిలోల గంజాయిని గీతానగర్ కట్ట సర్వీసు రోడ్డులో నిర్వహించిన తనిఖీల్లో పట్టుకున్నారు. ఏవోబీలో కిలో గంజాయిని రూ.3 వేల నుంచి రూ.4 వేలకు కొంటున్నారు. దాన్ని తమిళనాడులో రూ.10 వేలకు విక్రయిస్తున్నారని గుర్తించారు. వారిని గురువారం కోర్టులో హాజరుపరుస్తారు. తర్వాత ఈ ఇద్దరు నిందితులను కస్టడీకి తీసుకోవాలని పోలీసులు భావిస్తున్నారు. ఈ గంజాయి తరలింపుపై కృష్ణలంక పోలీసులు కేసు నమోదు చేశారు.

# 12మంది విద్యార్థులకు 100 శాతం స్కాలర్‌షిప్




తాడిపత్రి, (టుడే విదుర, జూన్ 26): : తాడిపత్రి ప్రాంతానికి చెందిన 12 మంది నిరుపేద విద్యార్థులకు అర్జాస్ స్టీల్ పరిశ్రమ వందశాతం స్కాలర్‌షిప్ అందిస్తున్నట్లు సీఈఓ పసుపులేటి ఆనంద్ తెలిపారు. పరిశ్రమ ఆవరణంలో ఆయన మాట్లాడుతూ.. ప్రవేశపరీక్ష, వ్యక్తిగత ఇంటర్వ్యూల ద్వారా ఈ విద్యార్థులను ఎంపిక చేశామన్నారు. వీరు కర్ణాటకలోని సండూర్ పాలిటెక్నిక్ కళాశాలలో మూడు సంవత్సరాల పాటు రెసిడెన్షియల్ విద్యను పొందుతారన్నారు. ఆ కళాశాలలో ప్రవేశపత్రాలను ఆ విద్యార్థులకు ఎంఈఓ నాగరాజు అందజేశారు. కార్యక్రమంలో ప్లాంట్ ఉద్యోగులు ఠాకూర్, నరేందర్, దేవరాజ్ పాల్గొన్నారు.

# విద్యుత బిల్లులు కట్టించుకునే వారు లేరా?



ముదిగుబ్బ,(టుడే విదుర, జూన్ 26): ప్రతినెలా 18వ తేదీ లోగా విద్యుత బిల్లులు చెల్లించాలని విద్యుత శాఖ అధికారులు చెబుతున్నారని అయితే ముదిగుబ్బలో విద్యుత బిల్లులు కట్టించుకునేవారు లేకపోవడంతో ఇబ్బం దులు పడుతున్నామని గృహ వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తు న్నారు. పలు వురు వినియోగదారులు కూడా విద్యుత సబ్‌స్టేషన వద్ద వేచి చూసి వెనుదిరిగి పోయారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తాము ప్రతి నెల విద్యుత బిల్లులు చెల్లించేందుకు కార్యా లయం వద్దకు వస్తున్నామని తెలిపారు. కార్యాలయం వద్ద ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం రెండు గంటల నుంచి నాలుగు గంటల వరకు విద్యుత బిల్లులు స్వీకరించాల్సి ఉందన్నారు. అయితే ఇక్కడ డబ్బులు కట్టించుకునేవారు లేకపోవడంతో రోజూ వేచి చూసి వెనుదిరగాల్సి వస్తోందన్నారు. ఈ నెల కట్టకపోతే మరుసటి నెలలో అదనంగా రూ. 100 బిల్లులో వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా ఒక నెల బిల్లు సకాలంలో చెల్లించకపోతే విద్యుత కనెక్షన తొలగి స్తారని వివరించారు. విద్యుత శాఖ అధికారులు నిర్లక్ష్యం వల్ల విద్యుత బిల్లులో అదనంగా వచ్చే వంద రూపాయలు ఎవరు చెల్లిస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు చర్యలు చేప ట్టి సకాలంలో విద్యుత బిల్లుల స్వీకరించే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై ట్రాన్స కో ఏఈ శివతేజను వివరణ కోరగా... పర్మనెంట్ విద్యుత ఆర్సీ లేకపోవడంతో విద్యుత బిల్లులు కట్టించుకునే సమస్య తలెత్తుతోందన్నారు. సమస్యను సంబంధిత అధి కారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. పర్మనెంట్ ఆర్సీని ఏర్పాటుచేస్తే సమస్య పరిష్కారం అవుతుందని అన్నారు.

# ఒకరి సొమ్ము మరొకరి ఖాతాలోకి..

- పాగోడుకు చెందిన లీలాప్రసాద్‌కు 'తల్లికి వందనం' సొమ్మును అందజేస్తున్న సచివాలయ ఉద్యోగి
- 'తల్లికివందనం'లో లోటుపాట్లు
- దిద్దుబాటు చర్యలు చేపడుతున్న అధికారులు
- అసలైన లబ్ధిదారులకు నగదు అందజేస్తున్న వైనం



నరసన్నపేట(టుడే విదుర, జూన్ 26): ముద్దాడపేటకు చెంది న ముద్దాడ పెంటమ్మకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. కానీ, తల్లికి వందన పథకం కింద ముగ్గురు పిల్లలకు సంబంధించిన డబ్బులు రూ.39వేలు ఆమె బ్యాంకు ఖాతాకు జమయ్యాయి. జలుమూరు మండలం పాగోడు గ్రామానికి చెందిన నేతింటి లీలా ప్రసాద్‌కు చెందిన ఆధార్ నెంబర్‌ను పాఠశాలలో తప్పుగా నమోదు చేయడంతో ఆ బాలుడికి చెందిన 'తల్లికివందనం' సొమ్ము పెంటమ్మ ఖాతాలో జమైనట్లు అధికారులు గుర్తించారు. దీంతో పెంటమ్మ నుంచి రూ.13 వేలు తీసుకొని లీలా ప్రసాద్‌కు అందించారు. – గెడ్డవానిపేటకు చెందిన రావాడ లక్ష్మికి ఇద్దరు పిల్లలు. కానీ ఆమె బ్యాంకు ఖాతాలో ముగ్గురు పిల్లలకు చెందిన 'తల్లికి వందనం' నగదు జమ అయింది. బసివలస గ్రామానికి చెందిన చల్ల హేమశ్రీకి చెందిన రూ.13వేలు లక్ష్మి ఖాతాలో జమైనట్లు అధికారులు గుర్తించారు. ఇలాంటి పరిస్థితి జిల్లాలో చాలాచోట్ల నెలకొంది. ఆ వివరాలను అధికారులు ఆరా తీసి అసలైన తల్లుల ఖాతాలకు నగదు సర్దుబాటు చేస్తున్నారు. ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన తల్లికి వందనం పథకం డబ్బులు ఒకరి ఖాతాకు బదులు మరొకరి ఖాతాకు జమైన ఘటనలు జిల్లాలో వెలుగుచూస్తున్నాయి. పాఠశాలల్లో విద్యార్థుల ఆధార్ నెంబరును తప్పుగా నమోదు చేయడంతో ఈ పరిస్థితి నెలకొంది. అసలైన లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమైనట్లు సచివాలయాల రికార్డుల్లో చూపిస్తున్నా ఆ డబ్బులు మాత్రం వారి అకౌంట్లలో పడలేదు. దీంతో సంబంధిత తల్లులు ఆందోళనకు గురికావడంతో అధికారులు ఎక్కడ తప్పు జరిగిందో తెలుసుకొని దిద్దుబాటు చర్యలు చేపడుతున్నారు. పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాల సమయంలో తల్లులు ఆధార్ సీడింగ్ చేసేటప్పుడు నెంబర్లు తప్పుగా నమోదు చేయడం, బ్యాంకుల్లో కూడా ఆధార్ నెంబర్లు తప్పుడు సీడింగ్ కావడం వల్ల ఒకరి డబ్బులు మరొకరి ఖాతాలకు జమైయ్యాయని అధికారులు చెబుతున్నారు.

# వసతుల్లేని ప్రభుత్వ బడులు

## నీరు, మురుగుదొడ్లు లేక విద్యార్థుల అవస్థలు



నల్లమాడ, (టుడే విదుర, జూన్ 26): ప్రైవేటు బడుల కంటే ప్రభుత్వ బడులు మిన్నగా ఉండాలని గత వైసీపీ ప్ర భుత్వం నాడు–నేడు ప నులు చేపట్టింది. రూ. కోట్లు వెచ్చించి పాఠ శాల భవనాలు నిర్మించి నా, నీటి వసతి లేక పోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నా రు. మరుగు దొడ్లు నిరుపయోగంగా మారాయి. మండలంలో ఏడు జిల్లా పరిషత ఉన్నత పాఠశాలలు, ఆరు ప్రాథమికోన్నత, 40 ప్రాథమిక పాఠశాలలు ఉన్నా యి. అలాగే ఎస్టీ బాలుర ఆశ్రమ పాఠశాల, అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం ఉన్నాయి ఇందులో నల్లమాడ, రెడ్డిపల్లి, పాత బత్తలపల్లి, సి. బండవాండ్లపల్లి, ఎర్రవంకపల్లి, దొన్నికోట, కురమాలల్లో జిల్లా పరిషత ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలన్నింటిలో పాఠశాల భవనాలు బాగా ఉన్నాయే కానీ, అరకొర నీటితో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. నీరు ఉ న్నా మరుగుదొడ్లు, మూత్రశాలలకు కొన్ని పాఠశాలలో సరిపడే పైపులైన ఏర్పాటు చేయలేదు. మరి కొన్నిపాఠశాలలో పైపులైన్లు ఉన్నా నీరు అరకొరగా ఉంది. నీటి సమస్యతో అధిక శాతం పాఠశాలల్లో మరుగుదొడ్లు ఉన్నా నిరుపయోగంగా మారాయి.

# పారిశుధ్యం మెరుగుపరచాలి



కవిటి, (టుడే విదుర, జూన్ 26): గ్రామస్థాయిలో పారిశుధ్యాన్ని ఎప్పటికప్పుడు మెరు గుపర్చాల్సిందేనని జడ్పీఈ సీఈవో ఎల్ఎల్ శ్రీధర్‌రాజా అన్నారు. బొరివంక, ఇద్దివానిపాలెం గ్రామాలను బుధవారం ఆయన సందర్శించారు. ప్రభుత్వం నిర్వహించిన ఐవీఆర్ కాల్స్‌పై ఈ గ్రామాల నుంచి పారిశుధ్యంపై వచ్చిన ఫిర్యాదుల మేరకు ఆయా గ్రామాల్లో పర్యటించి ప్రజలతో ముఖాముఖి మాట్లాడారు. పంచాయతీలకు ఇచ్చిన తోపుడుబండ్ల ద్వారా ఇంటింటా చెత్తను సేకరించి చెత్త కేంద్రాలకు తరలించాలన్నారు. తక్షణమే చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల కార్యదర్శులను ఆదేశించారు. ఈయన వెంట ఎంపీడీవో కె.శ్రీనివాసరెడ్డి, ఈవోపీఆర్డీ అబ్దుల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఇదిలావుంటే ఐవీఆర్ కాల్స్‌పై డీపీవో భారతిసౌజన్య రెండురోజుల కిందట పర్యటించి పారిశుధ్య పరిస్థితులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఎల్.రాజేష్, గుణవతిలకు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. ఈ క్రమంలో జడ్పీ సీఈవో పర్యటించడం విశేషం.

# కురిసింది వాన



- జలమయమైన జంగారెడ్డిగూడెం ప్రధాన రహదారి
- ఏలూరు జిల్లాలో భారీ వర్షం
- పల్లపు ప్రాంతాలు జలమయం
- వరికి మేలు.. ఆక్వా గుభేలు

ఏలూరు(టుడే విదుర, జూన్ 26): జిల్లాలో మధ్యాహ్నం నుంచి జోరు వాన కరుసింది. ఈదురు గాలులు, ఉరుములు, పిడుగులలో కూడిన భారీ వర్షాలు పలు చోట్ల కురిశాయి. వర్షాలతో వరి నారుమడు లు, నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఆక్వా రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎడతెరపిలేని వర్షంతో జనజీవనం స్థంభించింది. రహదారులు చిత్తడిగా తయారయ్యాయి. ఏలూరు నగరంతోపాటు జంగారెడ్డిగూ డెం, నూజివీడు, చింతలపూడి పట్టణాలు, మండల కేంద్రాలలో ప్రధాన రహదారులపై జనసంచారం తగ్గింది. ఏలూరు నగరంలో డ్రెయిన్లలో నీరు రహదారులపై చేరడంతో నగర ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఏజెన్సీ ప్రాంతంలో మధ్యాహ్నం నుంచి కుండపోతగా వర్షం పడింది. బుట్టాయగూడెం మండలం లో చెరువులు, వాగులు, పంట కాల్వలు, పొలాల్లో వర్షపు నీరు చేరింది. జంగారెడ్డిగూడెం పట్టణంలో లోతట్టు ప్రాం తాలు జలమయం అయ్యాయి. డ్రెయినేజీలు పొంగి ఇళ్లు, దుకాణాల్లో వర్షపు నీరు చేరింది. ఊర చెరువు ప్రాంతంలో ప్రధాన రోడ్డుపై మోకాలి లోతు నిలిచింది. గాంధీ బొమ్మ సెంటర్, ఏలూరు, శ్రీనివాసపురం, అశ్వారావుపేట రహదా రులపై భారీ గుంతలు వర్షంతో గోతులన్నీ నిండిపోయి వాహనదారులు ప్రమాదాల బారిన పడ్డారు. జీలుగుమి ల్లిలో జోరు వానతో చెరువు ఆయకట్టు రైతులు వరి సాగు ముమ్మరం చేశారు. పెదపాడు మండలంలో తెలవారు జాము నుంచి వర్షం, జల్లులు పడుతూనే ఉన్నాయి. ఉదయం పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, వాహనదారులు ఇబ్బంది పడ్డారు.

# వికలాంగుల చదరంగం పోటీలు ప్రారంభం



విజయనగరం(టుడే విదుర, జూన్ 26): జాతీయస్థాయి వికలాంగుల చదరంగం పోటీలు స్థానిక మెసానిక్ టెంపుల్ హాల్లో ప్రారంభమయ్యాయి. విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అతిధి విజయలక్ష్మి గజపతిరాజు ఈ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయస్థాయి పోటీలు విజయనగరంలో నిర్వహించడం అభినందనీయమన్నారు. దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి పోటీలకు వచ్చిన క్రీడాకారులను ఆమె అభినందించారు. వికలాంగులు ఎందులోనూ తీసిపోరు దేనినైనా సాధించగలరనే నమ్మకాన్ని మీరంతా కల్పించారన్నారు. మానసిక దైర్యం ఉంటే దేనినైనా సాధించగలమన్నారు. క్రీడా స్ఫూర్తితో ఆడి అంతర్జాతీయ పోటీలకు వెళ్లి పథకాలు తెచ్చి దేశ ప్రతిష్టను ఇనుమడింప చేయాలని ఆకాంక్షించారు. చదరంగం అసోసియేషన్ కార్యదర్శి జ్వాలాముఖి మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 150 మంది వికలాంగ క్రీడాకారులు ఈ పోటీలకు హాజరయ్యారని తెలిపారు. విజేతలుగా నిలిచిన వారు అంతర్జాతీయ పోటీలకు వెళ్లనున్నారని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# పోలీస్ శాఖకు కొత్త బైక్‌లు



ఏలూరు (టుడే విదుర, జూన్ 26): జిల్లా పోలీస్ యంత్రాంగానికి ప్రభుత్వం కొత్తగా 17 బుల్లెట్ వాహనాలు అందించింది. అసాంఘిక కార్యకలాపాల నిర్మూలన, డ్రోన్ల సహాయంతో రహదారి ప్రమాదాల నివా రణ, ట్రాఫిక్ నియంత్రణకు ద్విచక్ర వాహనాలు రావడం ముందడుగని ఎస్పీ కేపీఎస్ కిశోర్ అన్నారు. కొత్త ద్విచక్ర వాహనాలను ఎస్పీ కిశోర్ జిల్లా పోలీస్ కార్యాలయం వద్ద బుధవారం ప్రారంభించారు. స్వయంగా ఆయన బుల్లెట్ వాహనాన్ని నడిపారు. ఆయన మాట్లాడుతూ జిల్లాకు ప్రత్యేకంగా హైటెక్ బైక్‌లను కేటాయించారని, 112 డయల్‌కు వచ్చే ఫిర్యాదులపై తక్షణం పోలీసులు హాజరవడానికి ఈ వాహనాలు ఉపయోగపడతాయ న్నారు. డ్రోన్ల పర్యవేక్షణ ద్వారా ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డు ప్రమాదాలు నివారించడం, అసాంఘిక కార్యకలాపాల నివారణకు డ్రోన్లు ఎంతో ఉపయోగపడతాయన్నారు. రాత్రివేళ గస్తీ పోలీసులు చిన్న వీధులలో కూడా సులభంగా వెళ్లడానికి ఈ బైక్‌లు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఈ వాహనాలకు కెమెరాలు, టెక్నాలజీ సపోర్టు ఉండడం ద్వారా ఆధారాలు సేకరించడానికి వీలవుతుందన్నారు. ప్రమాద స్థితిలో బాధితులకు రక్షణ కల్పించేందుకు సత్వర చర్యలు కల్పించేందుకు వీలుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ ఎన్ సూర్యచంద్రరావు, డీటీసీ డీఎస్పీ ప్రసాద్, ఎఆర్ డీఎస్పీ చంద్రశేఖర్, ట్రాఫిక్ ఎస్ఐ లక్ష్మణరావు, ఎఆర్ఆర్ఐ పవన్‌కుమార్, డీసీఆర్బీ అబీబ్ బాషా, సీఐ కోటేశ్వరరావు, పలువురు పాల్గొన్నారు.

# పాఠశాల విలీనంపై ఆందోళన



ఎస్.యానం పెదపేట (టుడే విదుర, జూన్ 26): ప్రాథమిక పాఠశాల విలీనంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. తమ పిల్లలకు భద్రత కల్పించాలని 3, 4, 5 తరగతులు పెదపేట పాఠశాలలోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ మూడు రోజుల క్రితం విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేశారు. దీంతో విద్యాశాఖ అధికారులు విద్యార్థులను శ్రీరాం నగర్ పాఠశాలకు పంపించకుండా దగ్గరలో ఉన్న జడ్పి ఉన్నత పాఠశాలలో కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. అధికారుల హామీతో టిసిలు తీసుకున్న విద్యార్థులను శ్రీరాం నగర్ పాఠశాలకు వెళ్లాలని చెప్పడంతో విద్యా ర్థుల తల్లిదండ్రులు పెదపేట పాఠశాల వద్ద ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా విద్యా ర్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ పేద విద్యార్థుల జీవితాలతో విద్యాశాఖ అధికారులు చెలగాటం ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పిల్ల లను ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తే ఇన్ని ఇబ్బం దులకు గురి చేస్తారా? అని ప్రశ్నించారు. ఈ సం దర్భంగా పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు తిరుపతి రావు ఎంఇఒతో ఫక్షన్‌లో మాట్లాడారు. దగ్గరలో ఉన్న హైస్కూల్‌లోనే తరగతులు నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. ఈ ఆందోళనలో పిఎంసి ఛైర్మన్ బూల ప్రసాద్‌బాబు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# వీరయ్య హత్య కేసు నిందితుడి ఇంట్లో పోలీసుల తనిఖీలు



సాంబశివరావు ఇంట్లో తనిఖీలు చేస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

నాగులుప్పలపాడు,(టుడే విదుర, జూన్ 26): టీడీపీ నేత, మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్యచౌదరి హత్య కేసులోని నిందితుడైన అమ్మనబ్రోలు గ్రామానికి చెందిన ఆళ్ల సాంబశివరావు(సిద్ధాంతి) ఇంట్లో ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు తనిఖీలు చేపట్టారు. వీరయ్యచౌదరి హత్య కేసు దర్యాప్తులో భాగంగా సదరు కేసులోని పలువురు నిందితులకు, ఆళ్ల సాంబశివరావుకు మధ్య జరిగిన ఆర్థిక లావాదేవీలు, బ్యాంక్ చెక్‌లు, ఖాతా వివరాలు, ప్రామిసరీ నోట్లు, పలు కీలకమైన పత్రాలను డీఎస్పీ పరిశీలించారు. ఆ కేసులో ప్రధాన సూత్రధారిగా పోలీసులు భావిస్తున్న అదే గ్రామానికి చెందిన వ్యాపారవేత్త, సిద్ధాంతి మేనల్లుడైన ముప్పా సురేష్ కుటుంబ సభ్యులను సైతం డీఎస్పీ విచారించారు. ఆయన వెంట ఎస్ఐ రజియాసుల్తానా, సంతనూలపాడు ఎస్ఐ అజయ్‌బాబు ఉన్నారు.

# యువకుడి హత్య కేసులో ఇద్దరు అరెస్ట్



మద్రిపూడి,(టుడే విదుర, జూన్ 26): మద్రిపూడిలోని కొండవద్ద ఈనెల 18వ తేదీన హత్యకు గురైన ఎమ్మార్పీ కార్యాలయ ఉద్యోగి కొల్లా రాజశేఖర్ హత్య కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశామని కనిగిరి డీఎస్పీ సాయ ఈశ్వర్ యశ్వంత్ తెలిపారు. మద్రిపూడిలోని పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హతుడు రాజశేఖర్‌కు పొదిలి విశ్వనాథపురానికి చెందిన జగన్నాథం జయసింహతో స్వలింగ సంపర్క సంబంధాలు గత ఒకటిన్నర సంవత్సర కాలం కిందట కొనసాగాయి. ఈనేపథ్యంలో జయసింహ పొదిలిలో జరిగిన ఒక ఫంక్షన్‌లో రాజశేఖర్‌కు తారసపడ్డాడు. తన సంబంధాన్ని తిరిగి కొనసాగించాలని రాజశేఖర్‌ను ఒత్తిడి చేశాడు. రాజశేఖర్ అంగీకరించకపోవడమే కాకుండా తనపై ఒత్తిడి తెస్తే గే అనే విషయాన్ని నలుగురితో చెప్పి వివాహం కాకుండా చేస్తానని రాజశేఖర్ బెదిరించాడు. దీంతో జయసింహ రాజశేఖర్‌పై కక్ష పెంచుకున్నాడు. ఇదే సందర్భంలో జయసింహతో ఈ కేసులో ఏ2 నిందితురాలిగా ఉన్న పల్లా అనూషతో అక్రమ సంబంధం కలిగి ఉన్నాడు. ఈ నేపథ్యంలో కారులో నిందితులిద్దరూ కలిసి రాజశేఖర్‌ను పిలిపించుకున్నారు. ద్విచక్రవాహనంపై ఒంటరిగా వెళ్లిన రాజశేఖర్‌ను నిందితులు ఇద్దరూ కారుతో పలుమార్లు ఢీకొట్టి తొక్కి చంపారు. నిందితులిద్దరినీ వీరిద్దరినీ కొండ సమీపంలో అరెస్ట్ చేశారు. కారును సీజ్ చేశామన్నారు. ముద్దాయిలను కోర్టుకు హాజరు పరుస్తామని డీఎస్పీ తెలిపారు. సమావేశంలో కొండపి సీఐ సోమశేఖర్, ఎస్సై రమేషబాబు పాల్గొన్నారు.

# బడిబస్సు భద్రమేనా?

- ఆటోమేటిక్ టెస్టింగ్ విధానం అమలు
- యంత్రాలతో పూర్తిగా తనిఖీ
- ఫిట్‌నెస్ లేకుంటే పక్కకే..
- జిల్లాలో కాలంచెల్లిన బస్సులే అధికం




కాశీబుగ్గ, (టుడే విదుర, జూన్ 26): గతంలో మాదిరిగా ఇష్టారాజ్యంగా స్కూల్ బస్సులు తిప్పుతామంటే కుదరదు. కచ్చితంగా వాటికి సామర్థ్య పరీక్షలు నిర్వహించాల్సిందే. అది కూడా మాన్యువల్‌గా కాదు. ఆటోమేటిక్ టెస్టింగ్ విధానంలో తనిఖీ చేసి ధ్రువీకరణ పత్రం ఇవ్వనున్నారు. శ్రీకాకుళం నగరంలోని సింహద్వారం వద్ద ఉన్న ఓ ప్రైవేటు ఏజెన్సీకి రాష్ట్ర ప్రభుత్వం ఆ బాధ్యతను అప్పగించింది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ విధానం తప్పనిసరి చేశారు. మానవ తప్పిదాలకు, అక్రమాలకు అవకాశం ఇవ్వకుండా ఆటోమేటిక్ టెస్టింగ్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చినట్టు రవాణా, విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. ఈ విధానంతో బడి బస్సు భద్రమేనా? లేదా? అనేది పక్కాగా తేలనుంది.

567 బస్సుల్లో ఎన్ని ఫిట్? సాధారణంగా ప్రైవేటు విద్యాసంస్థలే బస్సులు నడుపుతుంటాయి. జిల్లాలో ప్రైవేటు పాఠశాలలు 398, జూనియర్ కాలేజీలు 71, డిగ్రీ కాలేజీలు 85, ఇంజనీరింగ్ కాలేజీలు 3, మెడికల్, నర్సింగ్ కాలేజీలు ఒక్కొక్కటి ఉన్నాయి. వీటి పరిధిలో 567 బస్సులు నడుస్తున్నాయి. వీటికి ఈ విద్యాసంవత్సరం ప్రారంభంలోనే సామర్థ్య పరీక్షలు నిర్వహించాలి. అయితే కొత్తగా ఆటోమేటిక్ టెస్టింగ్ విధానంతో ఎన్ని బస్సులు తమ సమర్థత నిరూపించుకుంటాయో చూడాలి. జిల్లాలో గత ఆరేళ్లుగా బస్సుల ఫిట్‌నెస్ పరీక్షలు తూతూమంత్రంగా జరిపినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఏటా ఏప్రిల్‌లో విద్యాసంస్థలకు సెలవులు ఇస్తారు. మే 15 నాటికి స్కూల్ బస్సులకు ఇచ్చే ఫిట్‌నెస్ ధ్రువీకరణపత్రం గడువు ముగుస్తుంది. పాఠశాలలు తెరిచే సమయానికి సామర్థ్య పరీక్షలు పూర్తిచేయాలి. వాస్తవానికి సురక్షితమైన, కండీషన్‌లో ఉన్న బస్సులనే వినియోగించాలి. 15 ఏళ్లు దాటిన బస్సులను అస్సలు వినియోగించకూడదు. కానీ, కొన్ని పాఠశాలలు పాత బస్సులకు రంగులు వేసి నడుపుతున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. దానికి చెక్ చెబుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా కొత్త తనిఖీ విధానాన్ని తెరపైకి తెచ్చింది. యంత్రాల సాయంతో సామర్థ్యాన్ని తనిఖీ చేస్తారు.

# టుడే వినోదం



## మళ్లీ హుషారుగా థియేటర్లలోకి...




యువతను నవ్వించి, వివిధ భావోద్వేగాలతో మనసును హత్తుకున్న చిత్రం 'హుషారు' 2018లో తొలిసారి ఈ సినిమా జనం ముందుకు వచ్చింది. ఈ సినిమా మరోసారి థియేటర్లలో సందడి చేసేందుకు సిద్ధమైంది. కాలేజీ రోజుల అనుభూతులను, స్నేహితుల మధ్య బంధాన్ని, యువత ఎదుర్కొనే సవాళ్ళను హాస్య, భావోద్వేగాలతో తీసిన 'హుషారు' చిత్రం జూలై 5న రీ–రిలీజ్ కానుంది. %ప్రముఖ నిర్మాత బెక్కం వేణుగోపాల్ రియాజ్ నిర్మించిన ఈ సినిమాకు శ్రీహర్ష కొనుగంటి దర్శకత్వం వహించారు. మొదటి విడుదల సమయంలోనే ఈ చిత్రం యూత్‌లో భారీ క్రేజ్ తెచ్చుకుంది. ఇప్పుడు మళ్లీ అదే క్రేజ్‌తో థియేటర్లకు తిరిగి వస్తోంది. ఈ సినిమా విజయం సాధించడంతో అప్పట్లో ప్రముఖ నిర్మాత దిల్ రాజు దర్శకుడు శ్రీహర్ష తోనే 'రౌడీ బాయ్స్' మూవీ నిర్మించి దాని ద్వారా శిరీష్ తనయుడు ఆశిష్ రెడ్డిని హీరోగా పరిచయం చేశారు. ఈ చిత్రంలో తేజస్ కంచెర్ల, తేజ్ కురపాటి, అభినవ్ మేడిశెట్టి, దినేష్ తేజ్ వంటి యువ నటులు పాత్రలు ప్రేక్షకుల మనసులో చెరగని ముద్ర వేశాయి.

## ఉప్పుకప్పురంబు టీమ్ తో స్పెషల్ చిట్ చాట్




జాతీయ ఉత్తమ నటి కీర్తి సురేశ్ బెస్ట్ యాక్టర్ సుహాస్ కీలక పాత్రలు పోషించిన సినిమా 'ఉప్పుకప్పురంబు' లో చిట్టి జయపురం అనే పల్లెటూరిలో జరిగే కథ ఇది. కొత్తగా అధికారంలోకి వచ్చిన వచ్చిన సర్పంచ్ అపూర్వకు ఎదురైన సవాళ్ళను ఆమె ఎలా ఎదుర్కొంది అనేది ఈ సినిమా కథ. ఈ మూవీ జూలై 4న ప్రైమ్ వీడియోస్ లో స్ట్రీమింగ్ కాబోతున్న సందర్భంగా ఈ చిత్రలోని కీర్తిసురేశ్, సుహాస్ తో పాటు దర్శకుడు అని ఐ.వి. శశి, నిర్మాత రాధిక రావుతో జరిపిన స్పెషల్ చిట్ చాట్.

## ఫ్యామిలీ బొనాంజగా హవీష్ మూవీ





'నువ్విలా, జీనియస్, రామ్ లీలా, సెవెన్' వంటి చిత్రాలతో ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు హీరో హవీష్ జూన్ 25 అతని పుట్టిన రోజు. ఆ సందర్భంగా ప్రస్తుతం సెట్స్ పై ఉన్న హవీష్ మూవీ టైటిల్ ను మేకర్స్ ప్రకటించారు. అలానే టైటిల్ గ్లింప్స్ ను విడుదల చేశారు. 'నేను రెడీ' అనే పేరు పెట్టిన ఈ సినిమాను నక్కిన త్రినాథ రావు దర్శకత్వంలో నిఖిల కోనేరు నిర్మిస్తున్నారు. మిక్కీ జే మేయర్ సంగీతాన్ని అందిస్తున్నారు.

## కన్నప్ప కు కోపం తెప్పించకండి...




ప్రముఖ నటుడు మోహన్ బాబు పతిష్ఠాత్మకంగా నిర్మించిన పాన్ ఇండియా మూవీ 'కన్నప్ప' శుక్రవారం వరల్డ్ వైడ్ రిలీజ్ అవుతోంది. ఈ సినిమాను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడమే కాదు... కథ చారిత్రకాంశాలతో ముడిపడింది కావడంతో నిర్మాత మోహన్ బాబు స్థలపురాణం తెలిసి వారి నుండి, అలానే శ్రీకాళహస్తి క్షేత్ర పూజారులను నుండి కూడా వ్రాతపూర్వకమైన అనుమతి తీసుకున్నారు. సెన్సార్ పరమైన అభ్యంతరాలను క్లియర్ చేసి మూవీకి యు/ఎ సర్టిఫికెట్ పొందారు. సినిమాలోని గ్రాఫిక్స్ విషయంలోనూ రాజీ పడకుండా అవసరమైతే సినిమా రిలీజ్ డేట్ ను ఒకటికి రెండు సార్లు వాయిదా వేసి... వాటిని సంతృప్తికరంగా వచ్చే వరకూ చేయించారు. ... మోహన్ బాబు మనసులోనూ, మంచు విష్ణు మనసులోనే ఎక్కడో ఏదో చిన్న సందేహం ఉండిపోయినట్టుగా ఉంది. తమ కుటుంబం మీద అక్కసుతో 'కన్నప్ప' చిత్రాన్ని ఇంట్లోని వారో బయటి వారో ఉద్దేశ్యపూర్వకంగా తక్కువ చేసిన మాట్లాడతారేమోనని! అందుకే వీళ్ళు ఈ విషయంలో కోర్టును ఆశ్రయించారు. గతంలో కేరళలోని ఓ నిర్మాత తన చిత్రాన్ని అక్కసుతో విమర్శించిన వారిపై కోర్టు కెక్కిన నేపథ్యంలో వీరు కూడా ముందస్తుగానే కొన్ని చర్యలు తీసుకున్నారు. అన్ని రకాల అనుమతులు, జాగ్రత్తలతో 'కన్నప్ప' సినిమాను తీసినా... ఎవరైనా ఉద్దేశ్యపూర్వకంగా, కువిమర్శలను, వ్యక్తిగత హననానికి పాల్పడితే తాము తీసుకునే చర్యలకు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ విషయమై తాజాగా మూవీ మేకర్స్ పబ్లిక్ కాషన్ నోటీస్ ను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.

## జపనీస్ వీడియో గేమ్‌లో రాజమౌళి



దర్శకుడు ఎస్.ఎస.రాజమౌళి ఓ జపనీస్ వీడియో గేమ్‌లో కనిపించడానికి సిద్ధమయ్యారు. వీడియో గేమ్స్ తయారీలో పేరుగాంచిన వ్యకి హిడియో కోజిమా. ఆయన తయారుచేసిన 'సూపర్ సక్సెస్ గేమ్ డెత్ స్ట్రాండింగ్' సెకండ్ వెర్షన్‌లో రాజమౌళి భాగమయ్యారు. 'డెత్ స్ట్రాండింగ్ 2'లో హాలీవుడ్ నటులు నార్మన్ రీడస్, ఎల్లీ ఫానింగ్‌లతో పాటు రాజమౌళి, ఆయన తనయుడు కార్తికేయ ప్రధాన పాత్రల్లో కనిపించనున్నారు. నేటి నుంచి ప్లే స్టేషన్‌లో ఈ గేమ్ అందుబాటులోకి రానుంది. ఈ మేరకు విడుదల చేసిన ఓ వీడియో ఆసక్తిని రేకెత్తించింది. ఇందులో స్పృహ కోల్పోయి ఉన్న రాజమౌళిని ఓ స్ట్రెచర్‌పై చికిత్స కోసం తీసుకెళ్తుంటారు. ఆ తర్వాత ఆయన థమ్స్ అప్ సింబల్‌తో ఓకే అనడంతో వీడియో ముగుస్తుంది. కాగా, 2022లో 'ఆర్ఆర్ఆర్' సినిమా టైమ్‌లో రాజమౌళికి హిడియో కోజిమాతో పరిచయం ఏర్పడింది. ఆ సమయంలోనే హిడియో కోజిమా కొన్ని ఫొటోలను షేర్ చేశారు. వీటిని చూసిన అభిమానులు ఈ ఫొటోలు ఆ సినిమా ప్రచారాల్లో భాగమేమో అని అనుకున్నారు. మరోవైపు, మహేశ్‌బాబు కథానాయకుడిగా రాజమౌళి తెరకెక్కిస్తున్న సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. 'ఎస్ఎస్ఎంబీ 29' వర్కింగ్ టైటిల్. దాదాపు రూ.వెయ్యి కోట్ల బడ్జెట్‌తో రెండు భాగాలుగా రూపొందుతున్న ఈ సినిమా మొదటి భాగాన్ని 2027లో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ప్రియాంక చోప్రా కథానాయిక.

## విష్ణు మూర్తి అవతారాలపై ఏడు సినిమాలు




'సలార్', 'కాంతార' చిత్రాలను ప్రేక్షకులకు అందించింది నిర్మాణ సంస్థ హొంబలే ఫిల్మ్స్. ఇప్పుడు వరుస సినిమాలను నిర్మించనుంది. 2037 వరకూ ఏడు సినిమాలను రూపొందిస్తున్నట్లు.. వాటి పేర్లను ప్రకటించింది. ఈ చిత్రాలన్నీ మహా విష్ణువు పది అవతారాలపై ఉండబోతున్నాయి. ఏడు భాగాలుగా తెరకెక్కుతున్న వీటిలో మొదటి పార్ట్‌ను ఇప్పటికే దర్శకుడు అశ్విన్‌కుమార్ 'మహావతార్: నరసింహ' పేరుతో జూలై 25న విడుదలకు సిద్ధం చేశారు. త్రీడీలో ఐదు భాషల్లో విడుదలవుతోంది చిత్రం. అలాగే ఈ చిత్రం నుంచి ఫస్ట్ సింగిల్ 'రోర్ ఆఫ్ నరసింహ'ను విడుదల చేశారు మేకర్స్. అలాగే మహావతార్ సినిమాటిక్ యూనివర్స్‌లో నిర్మాణ సంస్థ నిర్మించనున్న మరో ఆరు చిత్రాల పేర్లనూ తెలిపారు. 2027లో 'మహావతార్ :పరశురామ్'ను ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నట్లు తెలిపారు. 2029లో 'మహావతార్ :రఘునందన్'ను, 2031లో 'మహావతార్ :ద్వారకాదీశ్'ను, 2033లో 'మహావతార్ :గోకులానంద్'ను, 2035లో 'మహావతార్ :కల్కి 1'ను, 2037లో 'మహావతార్ :కల్కి 2'ను విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు.

## బీజేపీలో చేరనున్న నటి మీనా




అందాల నటి మీనా గురించి తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. బాలనటిగా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన మీనా.. హీరోయిన్ గా, స్టార్ హీరోయిన్ గా తెలుగు, తమిళ భాషల్లో మంచి గుర్తింపును తెచ్చుకుంది. ఇక కెరీర్ పీక్స్ లో ఉన్నప్పుడే ఆమె సాగర్ అనే వ్యక్తిని వివాహమాడి కొన్నేళ్ళు సినిమలకు దూరమైంది. ఇక ఈ జంటకు నైనీక అనే కూతురు కూడా ఉంది. ఆ చిన్నారి కూడా బాలనటిగా ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చింది. దళపతి విజయ్ హీరోగా అట్లీ దర్శకత్వంలో తెరకెక్కిన తేరి సినిమాలో విజయ్ కూతురుగా నైనీక నటించి మెప్పించింది. %ఇక కూతురు పెద్దది కావడంతో మీనా కూడా రీఎంట్రీ ఇచ్చి సహాయనటిగా నటించడం మొదలుపెట్టింది. ఇక ఆ సమయంలోనే మీనా బారత సాగర్ అనారోగ్యంతో మరణించిన విషయం తెల్సిందే. అతి చిన్న వయస్సులోనే భర్తను పోగొట్టుకున్న మీనా క్రుంగిపోకుండా.. కూతురు కోసం సంపాదించడం మొదలుపెట్టింది. తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో నటిస్తూ బిజీగా మారింది. ఇక తాజాగా మీనా రాజకీయాల్లోకి ఎంట్రీ ఇస్తుందని వార్తలు వినిపిస్తున్నాయి. దానికి కారణం ఈ మధ్యనే మీనా.. ఢిల్లీ వెళ్ళి ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్ ఖడ్ ను కలవడం జరిగింది. ఈ విషయాన్ని ఆమె స్వయంగా తన సోషల్ మీడియా ద్వారా తెలిపింది.

టుడే స్పోర్ట్స్

# నాలుగు దేశాల టోర్నీలో భారత్‌కు మూడో స్థానం



బెర్లిన్: నాలుగు దేశాల జూనియర్ హాకీ టోర్నీలో భారత జట్టు 2-1తో ఆస్ట్రేలియాను ఓడించింది. బుధవారం మూడో స్థానం కోసం జరిగిన ఈ మ్యాచ్‌లో భారత్ తరపున రోహిత్ (45వ నిమిషంలో), అజీత్ యాదవ్ (52వ ని.) రెండు గోల్స్ చేశారు. ఆట 40వ నిమిషం వరకు ఇరు జట్లు ఒక్క గోల్ కూడా కొట్టలేకపోయాయి. ఈ సమయంలో ఆట 43వ నిమిషంలో ఆసీస్ కెప్టెన్ టోబి మల్లోన్ తొలి గోల్ కొట్టి, ఆ జట్టును ఆధిక్యంలో నిలిపాడు.

# భారత్, ఇంగ్లాడ్ టెస్టుల మధ్య జస్ప్రీత్ బుమ్రాకు విశ్రాంతి.. నిజమేనా..




భారత క్రికెట్ జట్టు ఇంగ్లాండ్ పర్యటనకు బయలుదేరినప్పుడు, గెలుస్తుందని అందరికీ చాలా ఆశలు ఉన్నాయి. మొదటి మ్యాచులో పలువురు ఆటగాళ్లు సెంచరీలు సాధించగా, జస్ప్రీత్ బుమ్రా సత్తా చాటి ఐదు వికెట్లు తీసినా కూడా లీడ్స్‌లో జరిగిన మ్యాచ్ భారత్ ఓడిపోయింది. ఈ మ్యాచ్‌లో అద్భుతమైన వ్యక్తిగత ప్రదర్శనలు ఉన్నప్పటికీ, జట్టు తుది ఫలితాన్ని మార్చుకోలేకపోయింది. ప్రస్తుతం భారత జట్టు 0-1 తేడాతో వెనుకబడి ఉంది. ఇంగ్లాండ్‌తో ఆడిన తొలి టెస్ట్‌లో ఓటమి పాలైంది. ఈ సందర్భంగా బుమ్రాకు విశ్రాంతి ఇవ్వడం అనే అంశం వెలుగులోకి వచ్చింది.దీనిపై రవిచంద్రన్ అశ్విన్ స్పందించి బుమ్రాకు విశ్రాంతి ఇవ్వడం కంటే, అతను రెండో టెస్ట్ ఆడాలని, 1-1 తేడాతో సిరీస్‌ను సమం చేయడానికి ప్రయత్నించాలని అభిప్రాయపడ్డారు. భారత బౌలింగ్ యూనిట్‌లో జస్ప్రీత్ బుమ్రా పేస్ అటాక్‌ను ఆధిపత్యం చూపించినప్పటికీ, ఇంగ్లాండ్ పర్యటనలో అతనికి పెద్దగా సపోర్ట్ లభించలేదు. లీడ్స్ మ్యాచ్‌లో, బుమ్రా రెండు ఇన్నింగ్స్‌లలో దాదాపు 45 ఓవర్లు బౌలింగ్ చేశాడు. ఇది భారత బౌలర్ల మధ్య రెండో అత్యధిక ఓవర్ల మ్యాచ్ అని చెప్పవచ్చు. దీంతో అతనికి రెస్ట్ అవసరం అని చెబుతున్నారు. ఒకవేళ బుమ్రాకు విశ్రాంతి ఇచ్చి, అతను కోల్పోయిన శక్తిని తిరిగి పొందడానికి అవకాశం ఇవ్వాలనుకుంటే, అతని శారీరక దశలను మెరుగుపరచడానికి దోహదం చేస్తుంది. ఇంగ్లాండ్‌తో జరిగిన తొలి టెస్ట్‌లో ఆడిన తర్వాత, అతను తన శక్తిని పూర్తిగా వినియోగించి, జట్టు విజయం కోసం పోరాడాడు. ఈ నేపథ్యంలో అశ్విన్ తన యూట్యూబ్ ఛానెల్‌లో ఈ విషయంపై చర్చించారు. మొదట, ఇంత మంచి టెస్ట్ ఆడిన తర్వాత, జట్టులో పలు మార్పులు చేయడం ఇష్టపడనని పేర్కొన్నాడు. మేము 1-0 తేడాతో వెనుకబడి ఉన్నామని పరిగణనలోకి తీసుకుంటే, జస్ప్రీత్ బుమ్రాకు రెండో టెస్ట్ ఆడమని, సిరీస్‌ను సమం చేయాలని సూచిస్తానని చెప్పాడు. ఆ తర్వాత అతను విశ్రాంతి తీసుకోవచ్చని అభిప్రాయం వ్యక్తం చేశాడు.అశ్విన్ ఇచ్చిన ఈ ఆలోచన, జట్టులో మార్పులు చేసే బదులు క్రమబద్ధమైన విధానం పాటించాలని సూచిస్తుంది. భారత జట్టుకు సుదీర్ఘ పర్యటనలో ఆటగాళ్లపై ఒత్తిడి వంటివి పరిగణలోకి తీసుకోవడం కూడా చాలా ముఖ్యం. ఇంగ్లాండ్ టూర్‌లో, శార్దూల్ ఠాకూర్ బ్యాటింగ్ లో తన ప్రతిభను చూపించాడు. చివరి రోజు, మ్యాచ్ సమీపిస్తున్న సమయంలో, అతను రెండు కీలక వికెట్లు పడగొట్టాడు. అతని ప్రతిభ పట్ల చాలామంది క్రికెట్ దిగ్గజాలు ప్రశంసలు కురిపించారు. దీంతోపాటు నితీష్ రెడ్డిపై కూడా ఆశలు ఉన్నాయి.

# కార్ల్‌సన్‌కు చెమటలు పట్టించాడు



న్యూఢిల్లీ: ఐదుసార్లు వరల్డ్ చాంపియన్, నార్వే దిగ్గజ గ్రాండ్‌మాస్టర్ మాగ్నస్ కార్ల్‌సన్‌కు తొమ్మిదేళ్ల చిన్నోడు ఆరిత్ కపిల్ చెమటలు పట్టించాడు. 'ఎర్లీ టైటిల్ ట్యూస్‌డే' అనే ఆన్‌లైన్ టోర్నీలో బుధవారం వీరిరువురూ తలపడ్డారు. నిర్ణీత సమయం ముగియడానికి వేసిన రెండు ఎత్తుల ముందు వరకు కార్ల్‌సన్‌పై కపిల్ పూర్తి ఆధిపత్యం చెలాయించాడు. అయితే సమయం ముగియడంతో కపిల్ తప్పని పరిస్థితుల్లో డ్రాకు అంగీకరించాడు. ప్రస్తుతం జార్జియాలో అండర్-10 వరల్డ్ చాంపియన్‌షిపలో ఆడుతున్న కపిల్ అక్కడ బస చేస్తున్న హెూటల్ గది నుంచే కార్ల్‌సన్‌తో ఈ టోర్నీలో ఆడాడు. చెస్ ప్రపంచంలో కార్ల్‌సన్-కపిల్ మధ్య జరిగిన ఈ పోటీ చర్చనీయాంశంగా మారింది. గత ఏడాది భువనేశ్వర్‌లో జరిగిన ఒక చెస్ టోర్నీలో ఉజ్బెకిస్థాన్ జీఎం రాసెట్ జియాటిడినోవ్‌పై అద్భుత విజయానంతరం కపిల్ పేరు మార్మోగిపోయింది.

# బంగ్లాదేశ్ 220 పరుగులు 8 వికెట్లకు



కొలంబో: శ్రీలంక బౌలర్లు సమష్టిగా రాణించడంతో బుధవారం ఇక్కడ ప్రారంభమైన రెండో టెస్ట్ మొదటి ఇన్నింగ్స్‌లో తొలిరోజు ఆఖరికి బంగ్లాదేశ్ 8 వికెట్లకు 220 పరుగులు చేసింది. 76 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయిన దశలో ముష్ఫికర్ రహీమ్ (35), లిటన్ దాస్ (34) ఐదో వికెట్‌కు 67 పరుగులు జోడించి పరిస్థితి చక్కదిద్దారు. అంతకుముందు ఓపెనర్ షాద్‌మన్ ఇస్లామ్ (46) మినహా టాపార్డర్ బ్యాటర్లు విఫలమయ్యారు. భోజన విరామం తర్వాత గంటన్నరపాటు వర్షం వల్ల మ్యాచ్ ఆగిపోయింది. ధోనీ, ఇంజమామ్‌ను దాటేసిన ముష్ఫికర్: బంగ్లా బ్యాటర్ ముష్ఫికర్ రహీమ్..భారత దిగ్గజం ఎంఎస్ ధోనీ, పాకిస్థాన్ మాజీ కెప్టెన్ ఇంజమాముల్ హక్ రికార్డులను తిరగ రాశాడు. శ్రీలంకపై అత్యధిక అంతర్జాతీయ పరుగులు (3100) చేసిన ఏడో బ్యాటర్‌గా ముష్ఫికర్ నిలిచాడు. ఈక్రమంలో ధోనీ (3087)ని ముష్ఫికర్ అధిగమించాడు. అలాగే శ్రీలంకపై అత్యధిక టెస్ట్ పరుగులు (1593) చేసిన ముష్ఫికర్..హక్ (1559)ను వెనక్కినెట్టి మూడో స్థానానికి చేరాడు.

# రెండో టెస్ట్ కూర్పుపై మల్లగుల్లాలు




న్యూఢిల్లీ: హెడింగ్లీ టెస్ట్‌లో చాలావరకూ ఆధిపత్యం ప్రదర్శించి.. పటిష్ట స్థితిలో ఉన్నట్టుగా కనిపించిన టీమిండియా అనూహ్యంగా పరాజయంపాలు కావడం నిజంగా జీర్ణించుకోలేనిదే. కొత్త కెప్టెన్ శుభ్‌మన్ గిల్ సేన ఓటమికి పేస్ బౌలర్లే కారణమన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్‌గా జట్టులోకి వచ్చిన శార్దూల్ ఠాకూర్ తన ఎంపికకు న్యాయం చేయలేకపోయాడు. బ్యాటింగ్‌లో రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 5 పరుగులు మాత్రమే చేసిన శార్దూల్, రెండే వికెట్లు పడగొట్టాడు. ఇక ఎనిమిదేళ్ల తర్వాత జట్టులోకి వచ్చిన కరుణ్ నాయర్ విఫలమయ్యాడు. ఈ నేపథ్యంలో వచ్చే బుధవారం నుంచి బర్మింగ్‌హామ్‌లో జరిగే రెండో టెస్ట్‌లో పాల్గొనే భారత జట్టు కూర్పు మేనేజ్‌మెంట్‌కు పెద్ద సవాల్‌గా మారింది. పని భారం కారణంగా బుమ్రాకు విశ్రాంతినిస్తే బౌలింగ్ మరింత బలహీనపడే అవకాశం ఉంది. భారత బౌలర్లలో క్రమశిక్షణ, నిలకడ లోపించిందని పలువురు మాజీలు ఆరోపిస్తున్నారు. ఒకవైపు బుమ్రా తీవ్రంగా శ్రమిస్తున్నా.. ప్రసిద్ధ్ కృష్ణ, శార్దూల్ చెత్త బంతులతో ఇంగ్లండ్‌కు పుంజుకొనే అవకాశం కల్పించారు. ఈ నేపథ్యంలో రెండో టెస్ట్‌కు శార్దూల్ స్థానంలో కుల్దీపను తీసుకోవాలనే వాదన బలంగా వినిపిస్తోంది. ఒకవేళ కరుణ్ నాయర్‌ను పక్కనబెడితే.. నితీశ్ కుమార్‌కు చాన్స్ దక్కవచ్చు.ఎన్నో ఏళ్లుగా జట్టులో కీలకంగా ఉన్న రోహిత్, కోహ్లీ, అశ్విన్ లేకుండా భారత్ తొలిసారి బరిలోకి దిగింది. అయితే, బ్యాటింగ్ విభాగం ఫర్వాలేదనిపించినా.. అశ్విన్ లేని లోటు కనిపించింది. జడేజా కూడా పెద్దగా ప్రభావం చూపలేక పోయాడు. ఈ నేపథ్యంలో ఇంగ్లండ్ బ్యాటర్లను కట్టడి చేయాలంటే ఏదో మ్యాజిక్ చేయగల స్పిన్నర్ అవసరం. అనుభవంతోపాటు వికెట్లు పడగొట్టగల నేర్పు కూడా ఉన్న కుల్దీప యాదవ్‌తోనే అది సాధ్యమని మాజీలు సూచిస్తున్నారు. అవసరమైతే అతడి కోసం పేసర్‌నైనా త్యాగం చేయాలని చెబుతున్నారు. కాగా, బుమ్రాకు విశ్రాంతినిచ్చే పక్షంలో అర్ష్‌దీపను తీసుకోవచ్చని చెబుతున్నారు.తొలి టెస్టులో ఓడిన భారత్‌కు మరో చేదు వార్త. హెడింగ్లీలో అరంగేట్రం చేసిన బ్యాటర్ సాయి సుదర్శన్‌కు గాయమైనట్టు సమాచారం. ఫీల్డింగ్ చేస్తుండగా అతడి భుజానికి దెబ్బతగిలినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో బర్మింగ్‌హామ్‌లో జరిగే రెండో టెస్ట్‌కు అతడు ఫిట్‌గా లేడట. కాగా, కవర్‌గా ఇంగ్లండ్‌లోనే ఉంచిన పేసర్ హర్షిత్ రాణాను మేనేజ్‌మెంట్ విడుదల చేసింది. రెండో టెస్ట్‌కు అతడు జట్టుతో ఉండబోడని బోర్డు అధికారి ఒకరు చెప్పారు.

# గిల్ చెత్త రికార్డు

హెడింగ్లీ: కెప్టెన్‌గా పగ్గాలు చేపట్టిన తొలి టెస్ట్‌లోనే ఓడిన ఆరో భారత ప్లేయర్‌గా శుభ్‌మన్ గిల్ చెత్త రికా ర్డును సొంతం చేసుకొన్నాడు. సీకే నాయుడు, ఎంఏకే పటౌడీ, దిలీప్ వెంగ్‌సర్కార్, విరాట్ కోహ్లీ, బుమ్రా తర్వాతి స్థానంలో గిల్ నిలిచాడు. కాగా, సారథిగా ఆడిన తొలి టెస్ట్‌లోనే శతకం సాధించినా.. మ్యాచ్‌ను చేజార్చు కొన్న భారత కెప్టెన్‌గా కోహ్లీ, వెంగ్‌సర్కార్ సరసన గిల్ నిలిచాడు. 1987లో ఢిల్లీలో వెస్టిండీస్‌తో జరిగిన టెస్ట్‌లో కెప్టెన్‌గా అరంగేట్రం చేసిన వెంగ్‌సర్కార్ రెండో ఇన్నింగ్స్‌లో సెంచరీ సాధించాడు. కానీ, ఆ మ్యాచ్‌లో భారత్ 5 వికెట్ల తేడాతో ఓడింది. 2014లో అడిలైడ్ టెస్ట్‌లో సారథిగా కోహ్లీ తన తొలి మ్యాచ్‌లో రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ శతకాలు చేశాడు. కానీ, టీమిండియా 48 పరుగుల తేడాతో పరాజయం పాలైంది.

# పంత్ 7 కెరీర్ అత్యుత్తమ ర్యాంక్



దుబాయ్: భారత్ ధనాధన్ బ్యాటర్, వికెట్ కీపర్ రిషభ్ పంత్ టెస్ట్ ర్యాంకింగ్స్‌లో అత్యుత్తమ స్థానానికి చేరాడు. విడుదలైన ర్యాంకింగ్స్ టెస్ట్ బ్యాటర్ల విభాగంలో టీమిండియా వైస్-కెప్టెన్ పంత్ ఏడో స్థానం దక్కించుకున్నాడు. ఇంగ్లండ్‌తో హెడింగ్లీ టెస్ట్ రెండు ఇన్నింగ్స్‌లలో శతక మోత మోగించిన పంత్..ఒక ర్యాంక్ మెరుగుపరుచుకున్నాడు. అలాగే మొదటి టెస్ట్‌లో సెంచరీ చేసిన కెప్టెన్ గిల్ కూడా ఐదు స్థానాలు ఎగబాకి 20వ ర్యాంక్ కైవసం చేసుకున్నాడు. ఇంగ్లండ్‌తో తొలి టెస్ట్ మొదటి ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లు పడగొట్టిన బుమ్రా బౌలర్లలో తన టాప్ ర్యాంక్‌ను నిలబెట్టుకున్నాడు.

## టుడే బిజినెస్

# వావ్.. మళ్లీ తగ్గిన బంగారం, వెండి ధరలు



బంగారం, వెండి ప్రియులకు ఈరోజు కూడా శుభవార్త వచ్చేసింది. జూన్ 26న 2025న వీటి ధరలు ఒక్కసారిగా తగ్గాయి ఈ నేపథ్యంలో గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం జూన్ 26, 2025న ఉదయం 6.30 గంటల నాటికి బంగారం ధర గత రోజుతో పోల్చితే రూ. 270 తగ్గింది. ఇది బంగారాన్ని కొనాలనుకునే వారికి మంచి ఛాన్స్ అని చెప్పవచ్చు. ఈ క్రమంలో హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.98,940కి చేరుకుంది. 22 క్యారెట్ల బంగారం ధర రూ.90,690గా చేరింది. ఈరోజు వెండి ధరలు ఎంతకు చేరాయంటే..ఇటీవల బంగారంతో పాటు వెండి ధరలు కూడా తగ్గడం ప్రారంభమైంది. ఇదే క్రమంలో, ఢిల్లీలో వెండి ధరలు కిలోకు రూ. 1000 తగ్గి, ప్రస్తుతం రూ. 1,07,800కి చేరాయి. అలాగే, దేశంలోని ఇతర ప్రధాన నగరాల్లో కూడా వీటి ధరలు తగ్గిపోయాయి. హైదరాబాద్, వరంగల్, తిరుపతి, విజయవాడ వంటి ప్రాంతాలలో కూడా కిలో వెండి ధరలు రూ. 1,000 తగ్గి, రూ. 1,17,900కి చేరుకున్నాయి. ఇదే సమయంలో చెన్నై, కేరళ ప్రాంతాలలో కూడా వెండి ధరలు రూ. 1,17,900కు చేరాయి. దీంతోపాటు ఇతర ప్రధాన నగరాలైన నాసిక్, నోయిడా, మైసూర్, నాగ్‌పూర్, పాట్నా, సూరత్, జైపూర్, ముంబైలో కూడా వెండి ధరలు తగ్గి, రూ. 1,07,900 స్థాయికి చేరుకున్నాయి.

ప్రపంచవ్యాప్తంగా ఎలా ఉందంటే..

ప్రపంచ ఆర్థిక మార్కెట్లలో అనిశ్చితి పెరిగిన నేపథ్యంలో బంగారం ధర బుధవారం 3,320 డాలర్ల స్థాయికి చేరింది. ఇది ఆగష్టు 1.3% పడిపోయిన తరువాత మళ్లీ స్థిరంగా ఉందని నిపుణులు అంటున్నారు. ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల తగ్గింపులపై అంచనాలు పెరగడంతోపాటు ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కూడా వీటి ధరల నియంత్రణకు కారణమైంది. ఇరాన్ అణు ప్రణాళికపై యూఎస్ జరిపిన దాడుల కారణంగా ఇరాన్ ప్రోగ్రామ్ కొన్ని నెలలు ఆలస్యం అయిందని అమెరికన్ ఇంటెలిజెన్స్ నివేదిక వెల్లడించింది. దీంతో ఆర్థిక పరిస్థితులపై అనిశ్చితి కొనసాగుతోంది. అంతేకాదు, జూన్‌లో యూఎస్ వినియోగదారుల విశ్వాసం అనూహ్యంగా పడిపోయింది. దీంతో వడ్డీ రేట్లు తగ్గిపోవడంపై అంచనాలు మరింత పెరిగాయి.

# రూ 430కే మలేరియా వ్యాక్సిన్

న్యూఢిల్లీ: మలేరియా వ్యాక్సిన్ మరింత మంది పిల్లలకు అందుబాటులోకి తేవాలని హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్, బహుళ జాతి ఫార్మా కంపెనీ 'జీఎసకే పీఎల్‌సీ' నిర్ణయించాయి. ఇందుకోసం తాము అభివృద్ధి చేసి ఉత్పత్తి చేస్తున్న 'ఆర్‌టీఎస-ఎస్' వ్యాక్సిన్ ధరను 2028 నాటికి సగానికిపైగా తగ్గించనున్నట్టు ప్రకటించాయి. దీంతో మరో మూడేళ్లలో ఈ వ్యాక్సిన్ ఐదు డాలర్ల (పస్తుత మారకం రేటు ప్రకారం సుమారు రూ.430) కంటే తక్కువకే లభిస్తుందని తెలిపాయి. వ్యాక్సిన్ల తయారీ ప్రక్రియను మరింత మెరుగుపరచడం, ఉత్పత్తి సామర్థ్య విస్తరణ, తయారీ ఖర్చులు తగ్గించుకోవడం, తక్కువ లాభాల ద్వారా తాము వ్యాక్సిన్ ధరను 2028 నాటికి సగానికిపైగా తగ్గించనున్నట్టు రెండు కంపెనీలు బుధవారం ప్రకటించాయి. పిల్లలకు మలేరియా రాకుండా ముందు జాగ్రత్తగా ఈ వ్యాక్సిన్లు వేస్తారు.'గవి'కి అండగా: ప్రపంచవ్యాప్తంగా ముఖ్యంగా ఆఫ్రికా దేశాల్లో మలేరియా మహమ్మారి ఎక్కువగా ఉంది. ఏటా దాదాపు ఐదు లక్షల మంది పిల్లలు దీని బారిన పడి ప్రా ణాలు కోల్పోతున్నారు. దీంతో ఆఫ్రికా దేశాల్లోని పిల్లలకు చౌకగా మలేరియా వ్యాక్సిన్లు అందజేసేందుకు వ్యాక్సిన్ అలయెన్స్ (గవి) అనే స్వచ్ఛంద సంస్థ పని చేస్తోంది. ఈ సంస్థకు జీఎసకే వ్యాక్సిన్లు సరఫరా చేస్తోంది.

# జూన్ 30లోపు ముగియాల్సిన ఆర్థిక కార్యకలాపాలు ఇవే.. పూర్తి చేశారా లేదా..

దేశంలో ప్రతి నెలలో మాదిరిగా ఈసారి కూడా కొన్ని ఆర్థిక అంశాలు ఉన్నాయి. ఈ నెల మరికొన్ని రోజుల్లో పూర్తి కానున్న నేపథ్యంలో వాటి గురించి తెలుసుకోవడం ద్వారా ఇబ్బందులు లేకుండా ఉండవచ్చు. అయితే పన్ను చెల్లింపులు, రిటర్న్ దాఖలు, రిజిస్ట్రేషన్‌లు, ఇతర అవసరాలతో సంబంధం కలిగి ఉన్నాయి. అయితే ఈసారి ఏం ఉన్నాయనే విషయాలను ఇక్కడ చూద్దాం.

1. జీఎస్‌టీ రిటర్న్ దాఖలు

గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ కింద నమోదు చేసుకున్న వ్యాపారాలు తమ నెలవారీ లేదా త్రైమాసిక రిటర్న్‌లను దాఖలు చేయాలి. జూన్ 2025కి సంబంధించిన జీఎస్‌టీ రిటర్న్‌లు, జీఎస్‌టీఆర్-1, జీఎస్‌టీఆర్-3బీ, ఇతర సంబంధిత ఫారమ్‌లు జూన్ 30, 2025 లోపు దాఖలు చేయాలి. ఈ గడువు పాటించడం వల్ల జరిమానాలు, వడ్డీ చెల్లింపులను నివారించవచ్చు. అలాగే జీఎస్‌టీ పోర్టల్ ద్వారా ఈ రిటర్న్‌లను ఆన్‌లైన్‌లో దాఖలు చేయవచ్చు. వ్యాపారులు తమ లావాదేవీలను సమీక్షించి ఖచ్చితమైన సమాచారాన్ని సమర్పించాలి.

2. టీడీఎస్/టీసీఎస్ చెల్లింపులు

మే 2025 నెలకు సంబంధించిన ట్యాక్స్ డిడక్టెడ్ ఎట్ సోర్స్ , ట్యాక్స్ కలెక్టెడ్ ఎట్ సోర్స్ చెల్లింపులు జూన్ 7, 2025 నాటికి పూర్తి చేయాలి. అయితే, ఈ చెల్లింపులకు సంబంధించిన రిటర్న్‌లు జూన్ 30, 2025 లోపు దాఖలు చేయాల్సి ఉ ంటుంది. ఈ రిటర్న్‌లు సరైన సమయంలో దాఖలు చేయడం వల్ల ఆలస్య రుసుమును




తగ్గించుకోవచ్చు. టీడీఎస్ రిటర్న్‌లు ఇన్‌కమ్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్‌కు చాలా కీలకం. ఎందుకంటే ఇవి ఆయా వ్యక్తులు లేదా సంస్థల నుంచి తగ్గించిన పన్ను రికార్డులను నిర్వహిస్తాయి.

3. ఈపీఎఫ్, ఈఎస్ఐ కంట్రిబ్యూషన్స్

ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కింద నమోదు చేసుకున్న వారు మే 2025 నెలకు సంబంధించిన కంట్రిబ్యూషన్‌లను జూన్ 15, 2025 నాటికి చెల్లించాలి. అదనంగా, ఈఎస్ఐ రిటర్న్‌లు జూన్ 30, 2025 లోపు దాఖలు చేయాలి. ఈ కంట్రిబ్యూషన్‌లు ఉద్యోగుల సామాజిక భద్రతకు చాలా కీలకం. గడువు దాటితే జరిమానాలు విధించబడతాయి.

4. ప్రొఫెషనల్ ట్యాక్స్ చెల్లింపులు

కొన్ని రాష్ట్రాల్లో ప్రొఫెషనల్ ట్యాక్స్ చెల్లింపులు, రిటర్న్ దాఖలు జూన్ 30, 2025 నాటికి పూర్తి చేయాలి. ఈ గడువు ఆయా రాష్ట్ర నిర్దిష్ట నిబంధనలపై ఆధారపడి ఉంటుంది. కాబట్టి వ్యాపారులు, ప్రొఫెషనల్స్ స్థానిక చట్టాల గురించి తెలుసుకుని నిర్ణయించుకోవడం ఉత్తమం.

5. కంపెనీల చట్టం కింద వార్షిక దాఖలు

కంపెనీల చట్టం 2013 ప్రకారం, ప్రైవేట్, పబ్లిక్ కంపెనీలు తమ వార్షిక రిటర్న్‌లు ఆర్థిక స్టేట్‌మెంట్‌లను దాఖలు చేయాలి. ఆర్థిక సంవత్సరం ముగింపు (మార్చి 31, 2025) తర్వాత, ఈ దాఖలు సాధారణంగా జూన్ నెలలో గడువు ఉ ంటుంది. ప్రత్యేకించి ఆడిట్ పూర్తయిన కంపెనీలు ఈ గడువును పాటించడం వల్ల రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ తో సమస్యలను నివారించుకోవచ్చు.

6. బ్యాంక్ ఖాతా ఆడిట్

వ్యాపారాలు, వ్యక్తులు తమ బ్యాంక్ ఖాతాలను సరిచేయడం, ఆర్థిక స్టేట్‌మెంట్‌లను ఆడిట్ కోసం సిద్ధం చేయడం జూన్ 30, 2025 నాటికి పూర్తి చేయాలి. ఇది ఇన్‌కమ్ ట్యాక్స్ రిటర్న్ దాఖలు, జీఎస్‌టీ సమ్మతి కోసం సహాయపడుతుంది. ఆడిట్ ప్రక్రియలో ఏవైనా వ్యత్యాసాలను సరిచేయడం వల్ల భవిష్యత్తులో జరిమానాలను తగ్గించుకోవచ్చు.

# ఇంధన విక్రయం కోసం అంబానీతో అదానీ జట్టు



న్యూఢిల్లీ: భారత కుబేరులు ముకేశ్ అంబానీ, గౌతమ్ అదానీల మధ్య మరో భాగస్వామ్యం కుదిరింది. వాహన ఇంధన విక్రయం కోసం అంబానీకి చెందిన జియో-బీపీతో అదానీకి చెందిన అదానీ టోటల్ గ్యాస్ లిమిటెడ్ జట్టు కట్టింది. ఇందులో భాగంగా అదానీ టోటల్ గ్యాస్‌కు చెంది న సీఎన్‌జీ విక్రయ కేంద్రాల్లో జియో-బీపీకి చెందిన పెట్రోల్, డీజిల్‌ను సైతం విక్రయించనున్నారు. అలాగే, జియో-బీపీ బంకుల్లో అదానీ టోటల్ గ్యాస్‌కు చెందిన సీఎన్‌జీ కూడా అందుబాటులోకి రానుంది. ఇరువర్గాలకు చెందిన ప్రస్తుత బంకులతో పాటు భవిష్యత్‌లో ఏర్పాటు చేయబోయే వాటికీ ఈ భాగస్వామ్యం వర్తిస్తుందని బుధవారం సంయుక్తంగా విడుదల చేసిన ప్రకటనలో ఇరు కంపెనీలు స్పష్టం చేశాయి. బ్రిటన్ ఇంధన దిగ్గజం బీపీ పీఎల్‌సీ భాగస్వామ్యంలో ఏర్పాటైన జియో-బీపీ దేశవ్యాప్తంగా 1,972 పెట్రోల్ బంకులను నిర్వహిస్తోంది. అదానీ గ్రూప్, ఫ్రాన్స్‌కు చెందిన టోటల్ ఎనర్జీస్ భాగస్వామ్యంలో ఏర్పాటైన అదానీ టోటల్ గ్యాస్ లిమిటెడ్ 34 నగరాల్లో మొత్తం 650 సీఎన్‌జీ విక్రయ కేంద్రాలను కలిగి ఉంది. గడిచిన కొన్నినెలల్లో అంబానీ, అదానీ కంపెనీల మధ్య కుదిరిన రెండో వ్యాపార భాగస్వామ్యం ఇది. గత ఏడాది మార్చిలో అంబానీకి చెందిన రిలయన్స్.. మధ్యప్రదేశ్‌లో అదానీ పవర్‌కు చెందిన విద్యుత్ ప్రాజెక్టులో 26 శాతం వాటా దక్కించుకుంది. ఆ ప్లాంటులో ఉ త్పత్తి చేసే 500 మెగావాట్ల విద్యుత్‌ను రిలయన్స్ తన పారిశ్రామిక అవసరాల కోసం వినియోగించుకోనుంది.

# జియో నా జీవితంలోనే అతిపెద్ద రిస్క్

న్యూఢిల్లీ: రిలయన్స్ జియో ద్వారా 2016లో టెలి కం రంగంలోకి పునఃప్రవేశించడం తాను జీవితం తీసుకున్న అతిపెద్ద రిస్క్ అని ముకేశ్ అంబానీ అభివర్ణించారు. ఒకవేళ విశ్లేషకులు అంచనా వేసినట్లు రిలయన్స్ జియో ఆర్థికంగా విఫలమైనప్పటికీ, భారత్‌ను డిజిటలీకరించడంలో పోషించిన పాత్రకుగాను కంపెనీ ఇప్పటికీ విలువైనదిగా ఉండేదన్నారు. అంతర్జాతీయ కన్సల్టింగ్ సేవల దిగ్గజం 'మెకిన్సే అండ్ కో'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అంబానీ ఈ వ్యాఖ్యలు చేశారు. దేశంలో 4జీ సేవల నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసేందుకు రిలయన్స్ ఇండస్ట్రీస్ వేల కోట్ల రూపాయల సొంత నిధులను పెట్టుబడిగా పెట్టిందన్నారు. జియో ప్రస్తుతం 47 కోట్లకు పైగా కస్టమర్లతో దేశంలోనే అతిపెద్ద టెలికం




కంపెనీగా ఉంది. డీప్ టెక్ కంపెనీగా మారడమే లక్ష్యం: రిలయన్స్ ఇండస్ట్రీస్ ప్రతి 3-5 ఏళ్లకోసారి వ్యాపారంలో ఆర్జించిన రాబడితో తిరిగి పెట్టుబడులు పెడుతుందని ముకేశ్ అంబానీ అన్నారు. అలాగే, డీప్ టెక్నాలజీ, ఆధునిక మాన్యుఫాక్చరింగ్ కంపెనీగా ఎదగాలన్నదే రిలయన్స్ లక్ష్యమని ఆయన అన్నారు. జియోహాట్‌స్టార్ కస్టమర్లు 30 కోట్లు: రిలయన్స్ ఇండస్ట్రీసకు చెందిన ఓటీటీ ప్లాట్‌ఫామ్ జియోహాట్‌స్టార్ మొత్తం చందాదారుల సంఖ్య 30 కోట్లకు చేరింది. ప్రపంచ ఓటీటీ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్ చివరగా ప్రకటించిన 30.16 కోట్ల మంది కస్టమర్ల సంఖ్యకు చేరువైనట్లు కంపెనీ బుధవారం తెలిపింది.

# జీఆర్‌టీ జ్యువెలర్స్ గోల్డ్ ఫర్ ఆల్ ఆఫర్

హైదరాబాద్ : ఆభరణాల రిటైలింగ్ దిగ్గజం జీఆర్‌టీ జ్యువెల్లర్స్ తమ వినియోగదారుల కోసం మరో వినూత్న ఆఫర్‌ను ప్రకటించింది. అతి తక్కువ వేస్టేజ్ చార్జీల (వీఏ) ద్వారా వినియోగదారులు తాము నిర్దేశించుకున్న బడ్జెట్‌కు ఎక్కువ బంగా రం కొనుగోలు చేసేలా "గోల్డ్ ఫర్ ఆల్" పేరుతో ఈ ఆఫర్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ ఆఫర్‌లో వేస్టేజ్ చార్జీలు కేవలం 5 శాతం నుంచి ప్రారంభమవుతాయని కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ జీఆర్ ఆనంద్ అనంత పద్మనాభన్ తెలిపారు. ఈ ఆఫర్ ద్వారా తక్కువ ఖర్చులో కస్టమర్లకు ఆకర్షణీయమైన డిజైన్లను అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఒక్కోసారి వారు పొందే అదనపు బంగారం ఒక గ్రాము వరకు కూడా ఉ ంటుందన్నారు. తమ చేతిలోకి అదనంగా ఏదైనా డబ్బు వచ్చినట్టయితే భారతీ యులకు బంగారం కొనడం సాంప్రదాయి కంగా వస్తున్న ఆచారమని, బంగారం ధరలు ఎప్పుడెలా ఉంటాయో ఊహిం చడం కష్టంగా ఉన్న సమయంలో "గోల్డ్ ఫర్ ఆల్" తమ కస్టమర్లకు విలువను జోడిస్తుందని చెప్పారు.

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006